

సీన్ రివర్స్

- పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో ఎదురుగాలి?
- ఓటుకు రూ.వెయ్యి నుంచి రూ.3వేలు పంచిన వైసీపీ
- సీఎం సొంతూరులో రూ.2వేలు పంపిణీ
- ఫోన్‌పే ద్వారా చెల్లింపులు
- ఒళ్లు మండిన ఉద్యోగులు
- మాకే డబ్బులు ఇస్తారా.. అంటూ అసహనం
- 2వేలకు 116లు అదనంగా ఇచ్చి రిటన్ చెల్లింపు
- తొలిరోజు 84.05 శాతం పోలింగ్ నమోదు

ఐదేళ్లుగా సాగిన జగన్ రివర్స్ పాలనతో విసుగు చెందిన జనం సైతం రివర్స్ అయ్యారు. ఆదివారం జరిగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌తో ఈ విషయం స్పష్టమైంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో పోస్టల్‌బ్యాలెట్ ఓట్లు గంపగుత్తగా వైసీపీకి పడ్డాయి. అప్పుడు ఉద్యోగులు జగన్ మాటలు నమ్మారు. దీనికి తోడు అప్పుడూ ఓటుకు నోటు ఇచ్చారు. ఈ ఐదేళ్లలో జగన్ తత్వం బోధపడింది. ఎన్నికల వేళ తామేంటో ఉద్యోగులు చూపిస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లకోసం వైసీపీ నేతలు ఓటుకు రూ.1000 నుంచి రూ.3వేల దాకా ఇచ్చారని ప్రచారం సాగుతోంది. పులివెందులలో కొందరికి ఓటుకు రూ.2వేలు వంతున ఫోన్‌పే చేశారని.. అయితే ఒళ్లు మండిన వారు దానికి రూ.116 కలిపి రివర్స్ ఫోన్‌పే చేశారని ప్రచారం సాగుతోంది. పులివెందులలోనే వైసీపీకి ఎదురుగాలి వీస్తుండటంతో వైసీపీలో కలవరం మొదలైంది.



కడప గాంధీనగర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలో ఓట్లు వేసేందుకు వచ్చిన ఉద్యోగులు



(కడప-ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ తేదీ దగ్గర పడుతోంది. ఈనెల 13న ఎన్నికలు జరగనున్నాయి. అంటే వారం రోజులు మాత్రమే గడువు ఉంది. ఎలాగైనా గెలవాలనుకుంటున్న వైసీపీ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల కోసం పెద్దఎత్తున డబ్బులు వెదజల్లినట్లు చెబుతున్నారు. ఓటుకు రూ.3వేలు పంపిణీ చేసినట్లు చెబుతున్నారు. అయితే డబ్బులు ఎంత ఇచ్చినా సరే ఉద్యోగులు తొలిరోజు కూటమి వైపే మొగ్గు చూపినట్లు చెబుతున్నారు. ఇక షర్మిలా కాంగ్రెస్ పార్టీ బాధ్యతలు చేపట్టాక ఆ పార్టీకి కదలిక వచ్చింది. ఆ పార్టీ కూడా గతంలో కన్నా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పడినట్లు చెబుతున్నారు.

జిల్లాలో 23,203 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉన్నాయి. ఆదివారం ఉదయం జిల్లాలో ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. కడపలో గాంధీనగర్ ఉన్నత పాఠశాలలో, జయనగర్‌కాలనీలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా తొలిరోజు మొత్తం 15540 మంది ఓట్లకు గాను 13062 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 84.05 శాతంగా పోలింగ్ నమోదైంది. కడపలో 3209 మందికి గాను 2700 మంది ఓటు హక్కు నమోదు చేసుకోగా, 84.14 శాతంగా నమోదైంది. బద్వేలులో 1904 ఓట్లకు గాను 1661 పోల్ కాగా 87.84 శాతం నమోదైంది. పులివెందులలో 1835 ఓట్లకు 1608 (87.63 శాతం), కమలాపురంలో 1290 ఓట్లకు 1010 (78.10 శాతం) నమోదైంది. ప్రొద్దుటూరులో 2298 ఓట్లకు 2158 (94.34 శాతం), మైదుకూరులో 1342 ఓట్లకు 1299 మంది ఓటు హక్కు వినిగించుకోగా (96.80 శాతం) నమోదైంది. ఇతర జిల్లాల్లో ఓటు హక్కు 2400 మంది ఉండగా, 1113 (55.54 శాతం) మాత్రమే వినియోగించుకున్నారు.

డబ్బులు పంచారు

ఎన్నికల్లో ఎంత డబ్బు అయినా వెదజల్లి అధికారంలోకి వచ్చేందుకు వైసీపీ బరితెగించి నట్లు చెబుతారు. ప్రభుత్వ ఉద్యోగులు, అంగన్వాడీ కార్యకర్తలు కొందరు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారని పసిగట్టిన వైసీపీ నేతలు వారిని డబ్బుతో కొనుగోలు చేసినట్లు చెబుతారు. ప్రొద్దుటూరులో రూ.3వేలు ఇవ్వగా, పులివెందులలో 2వేలు ఇచ్చారని చెబుతారు. ఇక మైదుకూరులో 2వేలు, కడపలో 2వేలు, బద్వేలులో 1500, కమలాపురంలో 2వేలు, జమ్మలమడుగు 3వేలు పంపిణీ చేశారని చెబుతున్నారు.

అంతా గందరగోళం

పోస్టల్‌బ్యాలెట్ ఓటకు సంబంధించి తొలి నుంచి గందరగోళంగా ఉంది. ఎక్కడ ఓటు ఉండేది అనేది ఉద్యోగులకు సరిగా చెప్పలేదు. ఓటింగ్ కోసం పోలింగ్ కేంద్రాలకు వస్తే మీది ఇక్కడ కాదు, వీరబల్లెలో పనిచేస్తున్న ఓ మహిళ పోస్టల్‌బ్యాలెట్ ఓటు కోసం వస్తే మీరు ఒంటిమిట్ట వెళ్లండి, సిద్దవటం వెళ్లండి అంటూ చెప్పారు. ఇతర జిల్లాల్లో ఓట్లు ఉన్నవారికి జయనగర్ కాలనీలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. అయితే వారికి ఎక్కడ ఓటు ఉండేదనేది సరైన సమాచారం ఇవ్వకపోవడంతో సగం మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. పులివెందులలో అయితే సుమారు 86 ఓట్లు గల్లంతయ్యాయి. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ తీరును బద్వేలు ఉమ్మడి అభ్యర్థి బొజ్జ రోశన్న, కమలాపురం అభ్యర్థి క్రిష్ణ చైతన్యరెడ్డి, మైదుకూరులో పుట్టాసుధాకర్‌యాదవ్, కడపలో మేయరు సురేష్ బాబు, టీడీపీ నేతలు పరిశీలించారు,

ఓటుకు నోటు.. ఫోన్‌పే, గూగుల్‌పే చెల్లింపులు

ఉద్యోగుల ప్రతి ఓటును కీలకంగా చూస్తున్న వైసీపీ నేతలు పోస్టల్‌బ్యాలెట్ ఓటుకు కూడా పెద్దఎత్తున డబ్బులు ఇచ్చినట్లు చెబుతారు. ఎక్కడెక్కడ ఎవరెవరి ఓట్లు ఉన్నాయో ఆరా తీసి అధికార పార్టీ అనుకూల ఉద్యోగ సంఘాలు, నేతలతో నాయకులు నేరుగా కొందరికి డబ్బులు ఇవ్వగా, కొందరికి ఫోన్‌పే, గూగుల్‌పే, వాట్సాప్, పేటయం ద్వారా చెల్లింపులు జరిపినట్లు చెబుతారు. తక్కువ అమౌంటు కావడంతో ఎక్కడో దూరంగా ఉన్న వారికి డిజిటల్ పేమెంటు ద్వారా ఇచ్చినట్లు చెబుతారు.

చర్చనీయాంశంగా రివర్స్ చెల్లింపులు

ఇక సీఎం సొంతూరు పులివెందుల నియోజకవర్గంలో తొలిరోజు 1835 ఓట్లు ఉండగా 1655 మంది నమోదు చేసుకున్నారు. అయితే ఇక్కడ ఓట్ల కోసం 2వేల నుంచి 2500 వైసీపీ పంపిణీ చేసినట్లు చెబుతారు. దూరంగా ఉన్న కొందరికి ఫోన్‌పే ద్వారా రూ.2వేలు ఓటుకు వేశారు. ఒళ్లు మండిన కొందరు ఉద్యోగులు మా ఓటుకు 2వేలకు విలువ కడతారా అనుకున్నారేమో రూ.2వేలకు అదనంగా 116 చెల్లించి రివర్స్ చెల్లింపులు చేయడం చర్చనీయాంశంగా మారింది. జగన్ పాలన అంతా రివర్స్‌మయం అందుకే సొంతూరులో అధికారులు రివర్స్‌లో 116 అదనంగా ఇచ్చినట్లు చెబుతారు.



పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు



ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న వైసీపీ అభ్యర్థి అంజద్‌బాషా, టీడీపీ అభ్యర్థి మాధవీరెడ్డి



క్యూలో ఉన్న ఓటర్లు

ప్రొద్దుటూరులో వైసీపీ డబ్బు రాజకీయం

- పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు నగదు ప్రలోభాలు
- పోలింగ్ బూత్‌ల వద్దే ఫోన్ పే చెల్లింపులు



వైసీపీతో చెట్టాపట్టాల్ వేసిన పార్వర్డ్ పార్టీ అభ్యర్థి బంగారురెడ్డి

ప్రొద్దుటూరు, మే 5: ప్రొద్దుటూరులో ఓటర్లను అధికార వైసీపీ డబ్బు రాజకీయం శాసించనున్నదా... అంటే... అవునని పలువురు మేధావులు, రాజకీయ పండితులు అభిప్రాయపడుతున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలకే ప్రొద్దుటూరులో వైసీపీ నేతలు ఓటుకు రూ.3వేలు వంతున నగదు పంపిణీ చేశారు. అంతేకాకుండా కచ్చితంగా తమకు ఓట్లు పడతాయ నుకునే వారికి ప్రత్యేకంగా నగదును అందజేసినట్లు సమాచారం. నేరుగా పోలింగ్ కేంద్రాల సమీపంలో ఫోన్‌పేలు, నగదు బదిలీలు చేశారు. పోలీసులు ఎన్నికల నిఘా వ్యవస్థ ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉంది. దీనికి తోడు మొదటి రోజే వైసీపీ నాయకుడు ఎమ్మెల్యే రాచమల్లు బావమరిది పార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా వున్న బంగారురెడ్డి పోలింగ్ కేంద్రం వద్ద హల్‌చల్ చేశారు. పోలీసులు బంగారురెడ్డిని అడ్డుకున్నా ఆయన కేంద్రంలోకి దూసుకెళ్లేం దుకు ప్రయత్నించారు. లోపల ప్రతిపక్ష నేతలు ఉన్నందును అందరూ ఎదురెదురు పడితే ఘర్షణలకు అవకాశమేర్పడకూడదని పోలీసులు ఈ చర్యలు తీసుకుంటే దాన్ని బంగారురెడ్డి సహించలేక ఆగ్రహం ప్రకటించారు. టీడీపీ వారిని లోపలకి పంపి మమ్ములను పంపరా అంటూ గట్టిగా కేకలు వేశారు. దీంతో కొద్దిసేపు పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత చోటు చేసు కుంది.అధికార వైపీపీ, ప్రతిపక్ష టీడీపీ శ్రేణులు పరస్పరం పోలింగ్ కేంద్రం బయట మోహ రించారు. పోలీసులు వారిని పోలింగ్ కేంద్రాలకు దూరంగా తరిమికొట్టారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ మురళీధరన్‌తో కలిసి ఆర్వో కౌసర్‌భాను పోలింగ్ కేంద్రాల వద్ద పర్యవేక్షించారు.

వైసీపీ ఎమ్మెల్యేతో బంగారురెడ్డి చట్టాపట్టాల్

పార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా పోటీలో వున్న బంగారురెడ్డి సొంత బావ అయిన అధికార వైపీపీ ఎమ్మెల్యే రాచమల్లు వెంట చెట్టాపట్టాల్ వేసుకొని తిరుగుతుండటం విశేషం. రాచ మల్లు వద్దే కూర్చొని వైసీపీకి ఓటు వేయాలని ఓటర్లును అభ్యర్థించారు. వారితో ప్రత్యేకంగా మాట్లాడి దగ్గర వుండి ఓటర్లకు నగదును ఫోన్‌పేల ద్వారా బదిలీ చేసే పనిచేపట్టారు. కానీ అధికార వైసీపీ డబ్బు రాజకీయాలతో శాసించాలనుకున్నా పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు అయిన టీచర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, అంగన్‌వాడీ వర్కర్లు పెద్దఎత్తున కూటమి అభ్యర్థుల వైపు మొగ్గు చూపినట్లు బహిరంగంగా వెల్లడవుతోంది.



బంగారురెడ్డిని అడ్డుకుంటున్న సీఐ రమణ

కడపలో వైసీపీ కవ్వింపు చర్యలు

(కడప-ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో అడ్డదారులు తెరిచేందుకు వైసీపీ గేమ్ ప్లాన్ వేస్తోంది. అందుకు తగ్గట్టుగానే పోలింగ్‌కు వారం ముందు జరిగిన పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల్లో వైసీపీ తన వక్రబుద్దిని చూపించింది. ఆదివారం కడపలోని గాంధీనగర్ స్కూల్ వద్ద జరిగిన పోస్టల్ ఎన్నికల్లో వైసీపీ రెచ్చగొట్టే విధానం విమర్శలకు తావిచ్చింది. పోలింగ్ బూత్‌ల వద్దకు డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఆయన తమ్ముడు అహ్మద్‌బాషా వచ్చారు. అప్పటికే అక్కడ టీడీపీ, వైసీపీ శ్రేణులు ఎదురెదురుగా మోహరించి ఉన్నారు. మేయర్ సురేష్‌బాబు, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, మరో నేత పులి సునీల్‌కుమార్ అక్కడ ఉండి టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించారంటారు. ప్రతిగా టీడీపీ శ్రేణులు కూడా స్పందించడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. టీడీపీ నేత వేణుగోపాల్‌రెడ్డి ఉంటున్న కార్యాలయం వద్ద పోలీసులు హడావుడి చేశారు. ఇది కేబుల్ నెట్‌వర్క్ కార్యాలయం. టీవీకి కేబుల్ రాకపోతే మా వినియోగదారులు ఇక్కడికి వచ్చి ఫిర్యాదు చేస్తుంటారు. అంతలో పోలీసులు జోక్యం చేసుకుని వారందరినీ బయటికి పంపేశారు. తర్వాత కాంగ్రెస్ అభ్యర్థి అఫ్జల్‌ఖాన్ పోలింగ్ బూత్ వద్దకు వెళుతుండగా అక్కడి వైసీపీ బ్యాచ్ అవ మానించే విధంగా హేళన చేశారు. తిరిగి వస్తున్నప్పుడు అలాగే స్పందించడంతో ఆయన తనదైన శైలిలో 'రాండ్రా.. చూసుకుందాం' అంటూ చొక్కా విప్పి గుండెలు కొట్టుకోవడం కలకలం రేపింది. చివరకు పోలీసులు సర్దిచెప్పి బయటికి పంపించేశారు.



పోస్టల్ బ్యాలెట్ కేంద్రం వద్దకు వస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి అఫ్జల్‌ఖాన్

జగన్ ప్రభుత్వాన్ని ఓడించాలి

- ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బరాయన్



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరాయన్

కడప (మారుతీనగర్) మే 5: నెలవారిగా అందే పెన్షన్ డబ్బులపై ఆధారపడి జీవించే ప్రభుత్వ పెన్షనర్లకు సకాలంలో పెన్షన్ డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తూ.. పాలన సాగిస్తున్న జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఎన్నికల్లో ఓడించాలని ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాలంకి సుబ్బరాయన్ పెన్షనర్లకు పిలుపు నిచ్చారు. రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా ఆదివారం కడప ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎప్పుడు కూడా సకాలంలో పెన్షనర్లకు పెన్షన్ అందించిన దాఖలాలు లేవన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-బీజేపీ-జనసేన ఉమ్మడి కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రాగానే పెన్షనర్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తా మని హామీ ఇచ్చిందన్నారు. అదే జరిగితే పెన్షనర్ల కష్టాలు తొలగిపోతాయని పెన్షనర్లకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు పెద్దన్నగౌడ్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, సలహాదారుడు జయప్రకాష్, కార్యదర్శి సుభహాన్, నాయకులు పాల్గొన్నారు.

శనగల కొనుగోళ్లలో రూ.వంద కోట్లు దోపిడీ

- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై అంబటి తీవ్ర విమర్శ
- కాదని నిరూపిస్తే ఆత్మహత్యకు సిద్ధమని ప్రకటన

ఎర్రగుంట్ల, మే 5: రాష్ట్ర ప్రభుత్వం శనగల కొనగోళ్లకు కేటాయించిన రూ.వంద కోట్లు జమ్మల మడుగు ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి దోచుకున్నాడని ప్రభుత్వ ప్రధాన వ్యవసాయ మాజీ సలహాదారుడు అంబటి క్రిష్ణారెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఆదివారం ఎర్రగుంట్ల మండలం లోని ఏకేఆర్ కల్యాణ మంటపంలో జరిగిన ఎన్డీయే కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను వ్యవసాయ ప్రధాన సలహాదారుడుగా ఉన్నపుడు ముఖ్యమంత్రిని అడిగి రూ.200 కోట్లు శనగల కొనుగోలుకు మంజూరు చేయించానన్నారు. అందులో వందకోట్లు జమ్మలమడుగు నియోజకవర్గానికి ఇచ్చారన్నారు. అయితే ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి నియో జవర్గంలోని ప్రతి యార్డులో తన మనుషులను పెట్టుకుని క్వింటాల్‌కు వంద నుంచి రూ.150 వరకు వసూళ్లు చేశారన్నారు. రైతులను కూడా వదలకుండా దోచుకున్నాడని ఆరోపించారు. ఇది తాను నిరూపిస్తానని.. లేదని ఎమ్మెల్యే నిరూపిస్తే ఆత్మహత్యకు సిద్ధమని ప్రకటించారు. రాష్ట్రంలోనే అత్యంత అవినీతి పరుడు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అని ఆరోపించారు. ఇలాంటి వ్యక్తికి ఎమ్మెల్యే టికెట్ ముఖ్యమంత్రి ఇవ్వడం దారుణమన్నారు. తాను ఎక్కడా అవినీతికి పాల్పడకుండా రెండేళ్లపాటు సలహాదారునిగా ఉన్నానని తెలిపారు.

హుందాతనం అంటే.. మమ్మల్ని చూసి నేర్చుకో!

- మా అనుభవం ముందు పాపాల పెద్దిరెడ్డి ఓ బచ్చా
- అంగళ్లు రోడ్‌షోలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు

ములకలచెరువు/కురబలకోట, మే 5: నేను తొమ్మిదేళ్లు ముఖ్యమంత్రిని, కిరణ్‌కుమార్‌రెడ్డి మూడున్నర సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేశారు... హుందాతనం అంటే మమ్మల్ని చూసి నేర్చుకో పాపాల పెద్దిరెడ్డి అని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం కురబలకోట మండలం అంగళ్లులో జరిగిన రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ నేను కన్నెర్రజేసి ఉంటే ఈ అంగళ్లుకు వచ్చే వాడివా నువ్వు... పుంగనూరులో ఉండే వాడివా నువ్వు... మాకు రోషం లేదా...నీ కొమ్ములు విరుస్తాం...నీ కొవ్వు తగ్గిస్తాం ఖబడ్దార్ జాగ్రత్తగా ఉండమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రాష్ట్రం మీ అబ్బ జాగీరా...నువ్వు పుంగనూరులో... నీ తమ్ముడు వలస పక్షి తంబళ్లపల్లెలో... నీ కొడుకు ఎంపీ కావాలి...ముగ్గురూ కలిసి దోచుకుంటున్నారని అన్నారు. వీటిపై అడిగితే దాడులు చేస్తారా... నేను ములకలచెరువుకు వచ్చాను...పెద్దిరెడ్డి దోపిడీ చూశాను... అంగళ్లు మీదుగా పూతలపట్టుకు వెళుతుంటే ఇక్కడికి రాకూడదంట... 45 ఏళ్లుగా అంగళ్లు మీదుగా వెళుతున్నా... ఇప్పుడు కూడా సవాల్ విసురుతున్నా...అంగళ్లుకు వస్తానే ఉంటాను...అడ్డం వస్తే సైకిల్‌తో తొక్కించుకుంటూ పోతానని పెద్దిరెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద పెద్ద వాళ్లు రాజకీయం చేసిన ప్రాంతం ఇది...కలిచెర్ల..గట్టు ఫ్యామిలీలతో కంపేర్ చేసుకుంటే నీవు ఎంత అని ప్రశ్నించారు. తమ్ముళ్లు మీకు కోపం లేదా రోషం లేదా బానిసలుగా బతకాలని అనుకుంటున్నారా..మీ భవిష్యత్తును వీరు నాశనం చేస్తారన్నారు. 14 సంవత్సరాలుగా ముఖ్యమంత్రిగా పనిచేసిన నేను వస్తేనే నా మీద, నా తమ్ముళ్ల మీద తప్పుడు కేసులు పెట్టారన్నారు. నాకే ఇక్కడికి రావడానికి అడ్డంకులు సృష్టించారని, ఈ అంబోతులు మిమ్మల్ని బతకనిస్తారా.. బడుగు, బలహీనులు ఈ దుర్మార్గుల చేతుల్లో బలైపోవాల్సిందే అన్నారు. ప్రజాస్వామ్యంలో అంతిమ న్యాయ నిర్ణేతలు ప్రజలే అని.. ఇక మిగిలింది ఏడు రోజులేనని మీ ఓటుతో వీరికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె అభ్యర్థి జయచంద్రారెడ్డి, నియోజకవర్గ ప్రచార సమన్వయ కర్త సీడు మల్లికార్జుననాయుడు, రాష్ట్ర కార్యదర్శి పర్వీన్‌తాజ్, నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడు

- జగన్‌కు పాలించే అర్హత లేదు
- కేంద్రం ఇచ్చే నిధులు రాష్ట్రంలో దుర్వినియోగం
- రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే అభివృద్ధి
- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్



కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్న కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

ఎర్రగుంట్ల, మే 5: చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని, అందుకే తాము కూటమిగా ఏర్పడ్డామని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. జగన్‌కు పాలించే అర్హత లేదని రాష్ట్రంలో డబులింజన్ సర్కార్ వస్తేనే అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఆదివారం ఎర్రగుంట్ల మండలంలోని తిప్పలూరులో జరిగిన ఎన్డీయే కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అవినీతి పాలన జరుగుతోందన్నారు. ఇకపై దాన్ని సాగనివ్వమన్నారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులన్ని జగన్ దుర్వినియోగం చేశారన్నారు. కేంద్ర పథకాలు రాష్ట్రంలో సక్రమంగా అమలు కావడంలేదని మండిపడ్డారు. పేద ప్రజలకు ప్రవేశపెట్టిన ఇళ్లు కూడా సక్రమంగా నిర్మించలేదన్నారు. తనకు కడప చరిత్ర అన్నా, తెలుగు బాష అన్నా ఎంతో ప్రేమ అన్నారు. చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని అందుకే కలిసి పనిచేస్తున్నామని చెప్పారు. పదేళ్లుగా మోదీ మచ్చలేని పాలన అందిస్తున్నారన్నారు. త్రిపుల్ తలాక్‌ను రద్దుచేసి విప్లవాత్మక మార్పును ఎన్డీయే హయాంలో తీసుకొచ్చారన్నారు. ఎన్డీయే ఎమ్మెల్యే అభ్యర్థి సి.ఆదినారాయణరెడ్డిని, ఎంపీ అభ్యర్థి సి.భూపేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలను కోరారు.

అభివృద్ధికి సహకరించండి : భూపేశ్‌రెడ్డి

కడప ఎంపీ అభ్యర్థి (టీడీపీ) సి.భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన సమయంలో పదేళ్లపాటు ఇచ్చిన హామీలు కొనసాగించాలని, రాష్ట్రాభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని రాజ్‌నాథ్‌సింగ్‌ను కోరారు. కడపలో ఉక్కుపరిశ్రమ నిర్మించాలని, టూరిజంను అభివృద్ధి చేయాలని కోరారు. అలాగే స్పెషల్ స్టేటస్, లేదా స్పెషల్ ప్యాకేజీ కింద వెనుకబడిన రాయలసీమకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. కడపలో పరిశ్రమల స్థాపనకు సహకారమందించి నిరుద్యోగ యువతను ఆదుకోవాలన్నారు. రాష్ట్రంలో ఐదేళ్లుగా జగన్‌మోహన్‌రెడ్డి రివర్స్ పాలన సాగిస్తున్నారన్నారు. ఓటుతో రాక్షస పాలనను అంతమొందించాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో బందిపోటు పాలన : ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి (బీజేపీ) సి.ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బందిపోటు పాలన సాగుతోందన్నారు. ఇక్కడి ఎమ్మెల్యే, ఎంపీ పందికొక్కులని, ప్రజలను పీల్చుకు తింటున్న జలగలని అభివర్ణించారు. జీవనప్రమాణాల్లో భాగంగా ఇల్లు, కరెంటు, నీరు, రోడ్లు, స్కూల్స్, టాయ్‌లెట్స్, డ్రైనేజీలు ఉండాలన్నారు. అయితే ఇవన్నీ సీఎం జగన్, స్థానిక ఎమ్మెల్యే హయాంలో జరిగాయా అని ప్రజలను ప్రశ్నించారు. లేదని సమాధానం రావడంతో మరి ఇలాంటి ప్రతినిధులు అవసరమా అన్నారు. మనకు ప్రధానిగా మోదీ, సీఎంగా చంద్రబాబు రావాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, యల్లారెడ్డి, జనసేన జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, అంబటి క్రిష్ణారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, రితేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీ బందోబస్తు

కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రాక సందర్భంగా తిప్పలూరు వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏఎస్పీ స్థాయి అధికారులతో కూడిన పోలీసు బలగాలు, కేంద్ర సాయుధ దళాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. హెలీ ప్యాడ్‌కు చుట్టూ బారీ బారీ బారికేడ్లు ఏర్పాటు చేశారు. సభ జరిగే భవనం వెనుకవైపునే హెలీప్యాడ్ ఏర్పాటు చేశారు. రాజ్‌నాథ్ సింగ్‌కు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి స్వాగతం పలికి సభాస్థలికి తీసుకొచ్చారు.

బ్రాహ్మణులు, ఆర్యవైశ్యుల సంక్షేమానికి టీడీపీ ప్రాధాన్యం

- టీడీపీ అధికారంలోకి వస్తే అర్చకులకు కనీస వేతనం రూ.15వేల వరకు పెంపు
- దేవాలయాల్లో వారికి ట్రస్టు బోర్డు సభ్యులుగా నియామకం
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి




సమావేశానికి హాజరైన ఆర్యవైశ్య ప్రతినిధులు... ఆర్యవైశ్య సమావేశంలో మాట్లాడుతున్న కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి, వేదికపై ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), మే 5 : బ్రాహ్మణులు, ఆర్యవైశ్యుల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనివ్వనుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, టీడీపీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి అన్నారు. ఆదివారం కడప నగరం ఐఎంఏ హాలులో కడప బ్రాహ్మణ సంఘం నిర్వాహకులు శివరావు, డాక్టర్ గోపినాథ్‌ల ఆధ్వర్యంలో బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అలాగే కడప విష్ణుప్రియ హోటల్‌లో వైశ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్చకులకు కనీస వేతనం రూ.15వేల వరకు పెంచుతామని హామీ ఇచ్చారు. వారిని దేవాలయాల్లో ట్రస్టు బోర్డు సభ్యులుగా నియమిస్తామన్నారు.హిందూ దేవాలయాలు, సత్రాల ఆస్తుల పరిరక్షణకు హిందూ ఎండోమెంట్ బోర్డు ఏర్పాటు చేస్తామని, దానికి సంబంధించి టీడీపీ తన మేనిఫెస్టోలో పొందుపరిచినట్లు తెలిపారు. ప్రైవేటు దేవాలయాల్లో పని చేసే అర్చకులకు కనీస వేతనం ఉండేలా చేస్తామన్నారు. వార్షికాదాయం రూ.50వేలకు పైన ఉన్న ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు కనీస వేతనం రూ.15వేల వరకు పెంచుతామని వార్షిక ఆదాయం 50వేలకు తక్కువ ఉన్న ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు ధూపదీప నైవేద్యం కింద ఇచ్చే మొత్తాన్ని నెలకు రూ.5వేల నుంచి పదివేల వరకు పెంచుతామన్నారు. వైదిక, ఆగమ శాస్త్ర సంబంధ విషయాల్లో ఆయా ఆలయాలకు పూర్తి స్వతంత్ర ప్రతిపత్తి, తిరుపతి, ఒంటిమిట్ట వంటి పుణ్యక్షేత్రాల పవిత్రతకు మూలాధారాలైన వెయ్యికాళ్ల మండపం వంటి చారిత్రక కట్టడాలను పునరుద్ధరిస్తామన్నారు. దేవాలయాలకు పూర్తి రక్షణ గత ప్రభుత్వ హయాంలో దేవాలయాలపై జరిగిన దాడులకు బాధ్యులైన వారికి శిక్ష పడే విధంగా ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి శిక్ష పడేలా చేస్తామన్నారు. పురోహితులను వంట బ్రాహ్మణులను కులవృత్తులుగా గుర్తిస్తామని చెప్పారు. బ్రాహ్మణ కార్పొరేషన్, బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీని బలోపేతం చేస్తామన్నారు. తిరుపతితో సహా అన్ని దేవాలయాల్లో పూజారితో పాటు ఒక బ్రాహ్మణుడిని ట్రస్టు బోర్డు సభ్యుడిగా నియమిస్తామని తెలిపారు. బ్రాహ్మణులు అపర కర్మ చేసుకోవడానికి ప్రతి నియోజకవర్గంలో ఒక భవనం నిర్మిస్తామని, వేద విద్యను అభ్యసించిన నిరుద్యోగులకు యువగళం కింద రూ.3వేలు నిరుద్యోగ భృతి కల్పిస్తామన్నారు. ఆర్యవైశ్య సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు అవసరమైన నిధులు కేటాయిస్తామని స్పష్టం చేశారు. చిరువ్యాపారులకు వడ్డీ లేని రుణాల సౌకర్యం కల్పిస్తామన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో వ్యాపార నిర్వహణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని తెలిపారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారిక కార్యక్రమంగా చేపడతామన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే స్వర్ణాంధ్రప్రదేశ్‌గా రూపొందుతుందన్నారు. పింఛన్ల కోసం సచివాలయాలకు వచ్చిన వారిని తరువాత రావాలంటూ ఇళ్లకు పం పించడం దారుణమన్నారు. మధ్యాహ్నం వరకు పింఛన్లు ఇవ్వలేదని ఖజానాలో నిధులు లేకనే పింఛన్లను జగన్‌రెడ్డి ప్రభుత్వం పంపిణీ చేయలేకపోయిందన్నారు. ఇంటి వద్దనే పెన్షన్ల పంపిణీకి కలెక్టర్లు సరేనన్నా దాన్ని వ్యతిరేకిస్తున్న సెర్ప్ సీఈఓ ప్రవర్తన దుర్మార్గమన్నారు. పింఛను సొమ్ముతో పాటు ప్రభుత్వ నిధులను సొంత కాంట్రాక్టర్లకు జగన్‌రెడ్డి దోచిపెట్టాడని ఆరోపించారు. సచివాలయ సిబ్బంది గ్రామ కార్యదర్శులతో ఇంటి వద్దనే పింఛను పంపిణీ చేయలేకపోవడానికి నిధుల కొరతే కారణమన్నారు. వివేకా హత్యను చంద్రబాబుకు అంటగట్టి రాజకీయం చేస్తున్నారన్నారు. నేడు పింఛన్ల పంపిణీ అస్తవ్యస్తం చేసి దాన్ని కూడా టీడీపీకి అంటగట్టాలని దుష్ప్రచారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఈ కుట్రను ప్రజలు తిప్పికొట్టారన్నారు. చంద్రబాబు సీఎం కాగానే ఇంటి వద్దకే నెలకు రూ.4వేలు పింఛను అందిస్తామన్నారు. పింఛను పెంచింది టీడీపీ ప్రభుత్వమేన్నారు. జగన్‌రెడ్డి వలంటీర్లను ప్రజాసేవకులుగా కాకుండా తనసొంత పార్టీ కార్యకర్తల్లా దుర్వినియోగం చేసేందుకు చూస్తున్నారన్నారు. రూ.2వేలు ఉన్న పింఛన్‌ను జగన్‌రెడ్డి హయంలో విడతల వారీగా ఎన్నికల ముందు వరకు పెంచింది కేవలం రూ. 750 మాత్రమే అన్నారు.

ఈ ఐదేళ్లలో నిత్యావసర ధరలు భారీగా పెంచి పన్నుల మోత, ధరల వాతా పెట్టారన్నారు. విడతల వారీగా పెంపు దగాతో ఒక్కో పింఛనుదారుడికి జగన్‌రెడ్డి 31,500 ఎగనామం పెట్టారని ఆరోపించారు. వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొనకుండా ప్రజా సేవ మాత్రమే చేసే వలంటీర్లను రాబోవు టీడీపీ ప్రభుత్వం కొనసాగిస్తుందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం పింఛనుదారులకు నెల కు రూ.4వేల చొప్పున ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేస్తుందన్నారు. పేదవారి ఆకలి తీర్చేందుకు కిలో రూ.2కే బియ్యం తీసుకువచ్చిన ఘనత టీడీపీదన్నారు. వృద్ధులకు ఆసరాగా ఉండాలనే ఉద్దేశ్యంతో వృద్ధాప్య పింఛన్లు ప్రారంభించి పండుటాకుల జీవితాల్లో వెలుగులు నింపిన నాయకుడు ఎన్టీఆర్ అని ప్రసంశించారు. ఎన్టీఆర్ వారసత్వంగా టీడీపీని నడిపిస్తున్న చంద్రబాబునాయుడు ఆయన ఆశయాలను నెరవేర్చగలుగుతునారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధిపథంలో రాష్ట్రాన్ని నడిపించే సత్తా చంద్రబాబుకు ఉందన్నారు. విష్ణుప్రియ కళ్యాణమండంపంలో జరిగిన ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశంలో టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి, రాష్ట్ర క్యార్యదర్శి దుర్గాప్రసాద్, రమణయ్య, శ్రీనివాసకుమార్, పరుచూరి వెంకటేశ్వర్లు, ఆర్య వైశ్యుల ప్రతినిధులు పరిటాల వెంకటరమణయ్య వినోద్‌కుమార్, మునగా శ్రీనివాసులు, శంకరయ్య, మెంటా లక్ష్మీనారాయణ పలకల సుబ్బారావు, లక్ష్మణకుమార్, రెడ్డివిజయ, బుదవారపు క్రిష్ణమూర్తి, మెంటా రఘురాం పాల్గొన్నారు. అలాగే ఐఎంఏ హాలులో జరిగిన బ్రాహ్మణ సంఘం ఆత్మీయ సమావేశంలో డాక్టర్ గోపినాథ్, ఆడిటర్‌శివరావు, బ్రాహ్మణ సాధికార సమితి జిల్లా కన్వీనరు జనార్ధన్, నియోజకవర్గ కన్వీనరు అజయ్‌శర్మ, టీడీపీ నేత మంకాల సురేష్, రామరాజు, బ్రాహ్మణ సంఘ నేతలు రమణయ్య, సాయినాథ్, బాలక్రిష్ణ, బాలాజీ, ప్రసాదరావు, రామచంద్ర శర్మతో పాటు అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాధవీరెడ్డిని సత్కరిస్తున్న ఆర్యవైశ్యులు



మాధవీరెడ్డిని సత్కరిస్తున్న బ్రాహ్మణ ప్రతినిధులు




సమావేశానికి హాజరైన బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు... మాట్లాడుతున్న టీడీపీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి

చర్చి, దర్గాలో ప్రార్థనల్లో పాల్గొన్న షర్మిలారెడ్డి

కడప(కలెక్టరేట్), మే 5: ఎన్నికల ప్రచారంలో భాగంగా కడప పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ ఎంపీగా పోటీ చేస్తున్న పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి ఆదివారం చర్చిల్లో, పెద్ద దర్గాలో ప్రార్థనలు నిర్వహించారు. నగరంలోని కృపా పరిచర్యలు ప్రార్థన మందిరానికి వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బ్రదర్ ప్రసన్నకుమార్ ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం పెద్ద దర్గాలో కూడా ప్రార్థలను నిర్వహించారు. ఈమె వెంట కడప కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థి అఫ్జల్ ఖాన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు విష్ణుప్రీతం రెడ్డిలతో పాటు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.



పెద్ద దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిలారెడ్డి

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ 87.63 శాతం ఓటింగ్

- అంగన్వాడీల ఓటు గల్లంతు
- ఉదయం నుంచి సాయంత్రం పోలింగ్ కేంద్రం వద్దే




పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు... పోలింగ్ కేంద్రం వద్ద వేచి ఉన్న అంగన్వాడీలు

పులివెందుల, మే 5: పులివెందుల అసెంబ్లీ పరిధిలో ఉన్న ఉద్యోగులకు కల్పించిన పోస్టల్ బ్యాలెట్ 87.63శాతం పోలింగ్ అయింది. ఆదివారం ఉదయం 7గంటల సాయంత్రం 6గంటల వరకు అహోబిలాపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (మెయిన్)లో పోస్టల్ బబ్యాలెట్ ఓటింగ్ సాగింది. ఉదయం 7గంటల నుంచే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించుకునేందుకు వచ్చిన ఉద్యోగులు తరలివచ్చారు. ఎన్నికల విధులకు హాజరయ్యే వీరందరికి ఈ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ అవకాశాన్ని కల్పించారు. అంగన్వాడీల ఓట్లు కొందరివి గల్లంతయ్యాయి. వారి ఓటు వేసుకునేందుకు ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలింగ్ కేంద్రం వద్దే నిరీక్షించాల్సి వచ్చింది. సాయంత్రం కొందరి అంగన్వాడీలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కానీ కొంతమంది అంగన్వాడీలకు అక్కడ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం లేకపోయింది. ఫాం-12 అప్లికేషన్ ఇచ్చినప్పటికి పోస్టల్ బ్యాలెట్ పత్రం ఇవ్వకపోవడంతో ఓటు హక్కు వినియోగించుకోలేకపోయారు. వీరికి 7,8తేదీ న ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు అవకాశం కల్పించారు. పులివెందుల నియోజకవర్గ అసెంబ్లీ పరిధిలో 1835 ఓట్లకు గాను 1608 ఓట్లు పోలయ్యాయి. ఓటింగ్ జరుగుతున్న సమయంలో అటు టీడీపీ ఇటు వైసీపీ వర్గాలు పోలింగ్ కేంద్రం సమీపంలో వారి వారి బలగాలను మోహరించి ఉన్నారు. ఆర్ఓ వెంకటేశులు ఓటింగ్ సరళిని పరిశీలించారు. పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ పర్యవేక్షణలో సీఐలు శంకర్ రెడ్డి, మద్దిలేటి, ఎస్ఐలు బందోబస్తు నిర్వహించారు.

టీడీపీ ఏజెంట్లకు ఏమైనా జరిగితే భారీ మూల్యం తప్పదు




వేంపల్లెలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో బీటెక్ రవి... లింగాల మండలంలోని దొండ్లవాగు గ్రామంలో టీడీపీలో చేరిన వారితో బీటెక్ రవి

- బీటెక్ రవి సమక్షంలో టీడీపీలో చేరిక

వేంపల్లె, మే 5: జరగబోవు ఎన్నికల్లో మా పార్టీకి సంబంధించిన కార్యకర్తలకు గాని, ఎన్నికల్లో ఏజెంట్లుగా నిలబడే వారికి ఏమైన అవమానం జరిగిన, ఏదైన ఇబ్బంది సంఘటన జరిగిన చేసిన వారు భారీ మూల్యం చెల్లించుకుంటారని పులివెందుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి హెచ్చరించారు. రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమేనని ఎవరు ఇబ్బంది పెట్టిన వదిలిపెట్టే ప్రసక్తే లేదని మా కాళ్ల వద్దకు వచ్చేలా చేసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. వేంపల్లెలోని బిడాలమిట్టలో వైసీపీ నుంచి సుమారు 40 కుటుంబాలు టీడీపీలో చేరాయి. మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వలి, అబ్దుల్ తదితరుల ఆధ్వర్యంలో బీటెక్ రవి సమక్షంలో ఆదివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ తెలుగుదేశం ప్ర భుత్వం వస్తుందని అన్ని సర్వేలు చెబుతున్నాయన్నారు. చివరకు బెట్టింగ్ యాప్‌లలో కూడా టీడీపీ ప్రభుత్వమే వస్తుందని పందేలు కాస్తున్నారని తెలిపారు. వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చేందుకు ఎంతోమంది ఆసక్తి చూపుతున్నారని, వైసీపీకి పట్టున్న లింగాల మండలంనుంచే చేరుతున్నారని ఆయన తెలిపారు. తెలుగుదేశం పార్టీ కూటమితో అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలు ప్రజలందరికి మేలు చేస్తాయని ప్రతి ఒక్కరు టీడీపీ వెంట నడవాలని ఆయన పిలుపునిచ్చారు.

యువత మేలుకోవాలి: బీటెక్ రవి

చక్రాయపేట, మే 5: త్వరలో జరగనున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయకేతనం ఎగరవేసేందుకు యువత మేల్కోవాలని టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి మారెడ్డి రవీంద్రరెడ్డి (బీటెక్ రవి) అన్నారు. ఆదివారం చక్రాయపేట మండలంలోని దేవరగుట్టపల్లెలో మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన మాజీ సర్పంచు సానే సుబ్బరామయ్య, సానే రాహుల్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతూ యువత మేల్కొని వైసీపీని ఇంటికి సాగనంపాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని దివాలా తీస్తున్నాడని, బటన్ నొక్కుడు పేరుతో సంవత్సరానికి రూ.10వేలు వేసి మన వద్ద నుంచి మూడు లక్షలు లాక్కుంటున్నాడని పేర్కొన్నారు. మద్యం నిషేధమన్నాడు, మద్యం వల్ల ప్రతి వ్యక్తికి రూ.50వేలు పోగొట్టుకుంటున్నారన్నారు. అంతేకాకుండా గత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రైతులకు వ్యవసాయానికి ఉచిత కరెంట్ ఇస్తే ప్రస్తుతం జగన్‌మోహన్‌రెడ్డి మోటార్లకు మీటర్లు బిగించే ప్రయత్నంలో ఉన్నాడన్నారు. ప్రభుత్వం రాగానే రైతుకు మోటార్లకు మీటర్లు బిగించి రైతులను కష్టాల పాలు చేయనున్నారన్నారు. అలాగే ఇసుక బంగారం అయిపోయిందన్నారు. రైతులు సంపాదించుకున్న భూములు ఇక మీకు దక్కవని పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఫోటో ఉం టుంది కాబట్టి జగన్‌మోహన్‌రెడ్డి భూములు అయిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రాధాకృష్ణయ్య, బీసీ సంఘం నాయకుడు, మహదేవపల్లె రమేష్, నాగేశ్వరరావు, నరసింహులు పాల్గొన్నారు.

జగన్ రద్దు చేసిన పథకాలను మళ్లీ ప్రవేశపెడతాం

పులివెందుల టౌన్, మే 5: సీఎం జగన్ రద్దు చేసిన సంక్షేమ పథకాలను మళ్లీ ప్రవేశపెడతామని పులివెందుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి అన్నారు. ఆదివారం లింగాల మండలంలోని దొండ్లవాగు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



దేవరగుట్టపల్లెలో మాట్లాడుతున్న బీటెక్ రవి

ఈ సందర్భంగా దొండ్లవాగు గ్రామంలో టీడీపీ నేత దేవిరెడ్డి సంజీవరెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 15 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరికి బీటెక్ రవి టీడీపీ కండువా వేసి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల ఫలితాలతో రాష్ట్రం దశ దిశ మారబోతోందన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థులు కడప ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి, పులివెందుల ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవిలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లింగాల మండల ఇన్‌చార్జి విశ్వనాథరెడ్డి, దేవిరెడ్డి సంజీవరెడ్డి తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

వేముల, మే 5: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని పులివెందుల అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం మండలంలోని కొండ్రెడ్డిపల్లె, నారేపల్లె గ్రామాలలో బీటెక్ రవి మరదలు చంద్రమ్మ, కుమార్తె డాక్టర్ సాహితిలు ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయండి

పులివెందుల రూరల్, మే 5: విద్యుత్‌కు సంబంధించి ఏమైన సమస్యలు ఉంటే ఫిర్యాదులు అందిస్తే తగు చర్యలు తీసుకుంటామని డీఈఈ శ్రీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అంబకపల్లె రోడ్డులో ఉన్న సబ్‌స్టేషన్ ఆవరణం (24గంటలు) లేదా గాంధీ సర్కిల్‌లో ఉన్న సబ్‌డివిజన్ ఆఫీస్ (అన్న క్యాంటీన్) (ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు), నూతన బస్టాండ్ ఆవరణంలో ఉన్న సెక్షన్ ఆఫీస్ (ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ఆదివారం మరియు సెలవు రోజుల్లో అంబకపల్లె రోడ్డులో ఉన్న సబ్‌స్టేషన్ ఆవరణంలో మాత్రమే ఫిర్యాదు చేయాలన్నారు. పులివెందుల పట్టణం, డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల వినియోగదారులు తమ ఫిర్యాదులు నమోదు చేయవచ్చు అన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి

వేంపల్లె, మే 4: ప్రతి ఒక్కరు ఓటు వేయాలని, తాము అండగా ఉన్నామని స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని వేంపల్లె సీఐ చాంద్‌బాష అన్నారు. ఎస్పీ సిద్దార్థ్ కౌశల్, పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు వేంపల్లె సీఐ చాంద్ బాష ఆధ్వర్యంలో సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. ఆదివారం మండలంలోని అలవలపాడు, రామిరెడ్డిపల్లె, ముతుకూరు, వెలమవారిపల్లె, బక్కన్నగారిపల్లె గ్రామాలతో పాటు వేంపల్లె పట్టణంలోని ప్రధాన వీధుల్లోఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రశాంత వాతావరణం లో ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, ఆర్ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న సీఐ చాంద్‌బాషా

సోమసుందరేశ్వర స్వామి ఆలయంలో పంచామృతాభిషేకం

కడప (కల్చరల్), మే 5: శివప్రదోషం సందర్భాన్ని పురస్కరించుకుని గడ్డిబజార్‌లో వెలసిన సోమసుందరేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం సాయంత్రం 5.45 నిమిషాలకు పంచామృతాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి చంద్రమౌళి శర్మ సారథ్యంలో స్వామివారికి గణపతి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తదుపరి పరమ శివుడికి, నందీశ్వరుడికి ఏకకాలంలో సామూహిక రుద్రాభిషేకం గావించారు. అనంతరం స్వామివారికి విశేష అలంకరణ, మహామంగళ హారతి, మంత్ర పుష్పం, విశేషంగా హాజరైన భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం గావించారు. స్వామివారికి అభిషేకం చేయడం వలన ఆరోగ్య సం బంధ దోషాలు తొలగి రాహుకేతు దోషసహిత సకల దోష పరిహారం కాగలవని భక్తు విశ్వాసం. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని స్వామివారి సేవలో తరించారు.



ప్రత్యేక అలంకరణలో నందీశ్వరుడు

వేములలో వైఎస్ భారతి ప్రచారం

వేముల, మే 4:వేములలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి భారతి ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏప్రిల్ నుంచే రూ.4 వేలు పింఛన్ అమలు

● 150 కుటుంబాలు టీడీపీలో చేరిక

సీకేదిన్నె, మే 5: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంట ఏప్రిల్ నెల నుండే రూ.4 వేలు పింఛన్ అమలు పరచి ఏప్రిల్, మే, జూన్ నెల జూలైలో ఒకేసారి రూ.7 వేలు పింఛన్ ఇవ్వడం జరుగుతుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. సీకేదిన్నె మండలం మూలవంక, ఆజాద్‌నగర్, కొత్తపేట, గోపాలపురం గ్రామాలకు చెందిన 150 కుటుంబాలు ఆదివారం పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా చైతన్యరెడ్డి ఆధ్వర్యంలో చేరారు. బాబు షూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆజాద్‌నగర్, చెర్లోపల్లెలో పబ్బాపురంలో టీడీపీ నాయకులు ఇంటింటికి తిరిగి టీడీపీ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీలో చేరిన వారిలో హరికృష్ణ, పబ్బులేటి శివక్రిష్ణ, సయ్యద్ మహబూబ్‌బాష, పట్టెం వెంకటేష్, కొరముట్ల వెంకటసుబ్బయ్య, బండి రామక్రిష్ణ, సయ్యద్ మౌలాలీ, పరమేష్, శ్రీనివాసులు, మున్నా, కుళాయప్ప, వెంకటమురళీకృష్ణ, వెంకటసుబ్బయ్య, గజ్జెల వేణుగోపాల్‌రెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, పర్వతరెడ్డి, చిన్నపుల్లారెడ్డి, నడిపి వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి, బొర్రా చంద్రశేఖర్‌రెడ్డి, తదితర దాదాపు 150 కుటుంబాలు చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు క్రిష్టారెడ్డి, క్రిష్ణకిశోర్‌రెడ్డి, మోహన్‌బాబు, డీవీ సుబ్బారెడ్డి, రమణయ్య, వీరూప్రసాద్, రాజారావు, నజీర్, నాగేంద్రరెడ్డి, ధర్మారెడ్డి, శంకర్‌రెడ్డి, గఫూర్, గోవిందు, మహేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు: ప్రజల సంక్షేమ అభివృద్ధి కోసం ఏ మాత్రం పాటుపడని వైసీపీ ప్రభుత్వాన్ని ఓడించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం చెన్నూరు, కొండపేట గ్రామాల్లో పలువురు టీడీపీలో చేరారు. ఈ విషయమై చెన్నూరుకు వచ్చిన ఆయన ఈ రెండు గ్రామాల్లో ప్రజలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. టీడీపీని ఖచ్చితంగా గెలిపించాలని, కమలాపురం నియోజకవర్గంలో పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డిని సైకిలు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు.




సీకేదిన్నెలో పుత్తా నరసింహారెడ్డి, చైతన్యరెడ్డిల ఆధ్వర్యంలో టీడీపీలో చేరినవారు, వీఎన్ పల్లెలో పార్టీలో చేరిన వారితో పుత్తా నరసింహారెడ్డి

కొండపేటలో 50 కుటుంబాలు చేరిక

మండలంలోని కొండపేట గ్రామంలో టీడీపీ సీనియర్ నేత మాడిశెట్టి రవిశంకర్ ఆధ్వర్యంలో వైసీపీ సీనియర్ నేతలు దామిశెట్టి నాగభూషణం, వంశీతో పాటు 50 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. వారికి పుత్తా టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దుర్గాప్రసాద్, కొండపేట టీడీపీ నేతలు బాలకొండయ్య, ఓబుల కొండయ్య, ఎర్రయ్య, అబ్బన్న, కటారి వీరన్న, మెకానిక్ ప్రసాద్, సంజీవరాయుడితో పాటు శాస్త్రి, మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, బాలక్రిష్టారెడ్డి, మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివారెడ్డి, బలిజ సంఘం జిల్లా నేత ఆకుల ప్రసాద్‌బాబు, మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, గ్రంథాలయ జిల్లా మాజీ చైర్మన్ రామకోటిరెడ్డి, డాక్టర్ ఆదర్శ్‌రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

చెన్నూరుకు చెందిన ఎంఆర్‌డీ (మేరువ రాందాస్)కుటుంబం పుత్తా నరసింహారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరింది. పార్టీలో చేరిన వారిలో మేరువ రామచంద్రుడు, రఘు, క్రిష్ణ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ నాయకులు షబ్బీర్‌హుసేన్, నియోజకవర్గ నాయకుడు ఖాజహుసేన్, మండల కన్వీనరు విజయభాస్కరరెడ్డి, మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వల్లూరు: అభివృద్ధే టీడీపీ నినాదమని కమలాపురం టీడీపీ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మాచిరెడ్డిపల్లెలోని ఆయన స్వగృహంలో కోట్లూరు గ్రామానికి చెందిన 18 కుటుంబాలవారిని పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, ఎటువంటి ఇబ్బంది వచ్చినా అది రాత్రి సమయమైనా తనకు ఫోను ద్వారా తెలియజేస్తే సాయం అందిస్తానన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే అందరి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ నిధులను కూడా కేటాయించి అన్ని సంక్షేమ పథకాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. టీడీపీ నేతలు క్రిష్టారెడ్డి, నాగసుబ్బారెడ్డి, హరిక్రిష్ణ ఆధ్వర్యంలో పలు కుటుంబాలవారు టీడీపీలో చేరారు.

పెండ్లిమర్రి: టీడీపీ అధికారంలోకి వస్తే అమలు పరిచే సూపర్‌సిక్స్ పథకాలతో ప్రతి ఒక్కరికి సంక్షేమం దక్కుతుందని కమలాపురం టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి కుటుంబ సభ్యులు అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తసంగటిపల్లె, చెర్లోపల్లె, పెండ్లిమర్రి పంచాయతీలోని అన్ని గ్రామాలలో పుత్తా నరసింహారెడ్డి తమ్ముడు పుత్తా రామచంద్రారెడ్డి, భార్య సరళమ్మ, మరదలు శివమ్మ, పుత్తా లక్ష్మిరెడ్డి భార్య హరిత, చెల్లెలు యశోదమ్మలు ఇంటింటికి తిరుగుతూ టీడీపీని గెలిపించాలని కోరారు. మినిమేనిఫెస్టోను వివరించారు.

వీరపునాయునిపల్లె: వైసీపీ నేత సాయినాథ్‌శర్మ అనుచరులు ఆదివారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి అధ్యక్షతన కొక్కు గోపాల్‌యాదవ్‌లతో పాటు 30 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. టీడీపీ నాయకులు బైరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, గోపాల్‌యాదవ్, రవి, అరుణ్‌కుమార్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమలాపురం రూరల్: టీడీపీ విజయం తథ్యం అని టీడీపీ కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా చైతన్యరెడ్డి అన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు రిజిస్టరు చేసుకున్న వారందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఆదివారం నగర పంచాయతీ పరిధిలోని బాలికల ఉన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అక్కడకి వెళ్లి పరిశీలించారు.

వైభవంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

వల్లూరు, మే 5: ప్రసిద్ధిగాంచిన పంచమ నదీ సంగమంలో కొలువై ఉన్న కామాక్షి సమేత వైద్యనాథేశ్వర, శ్రీలక్ష్మి చెన్నకేశవల వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం సాయంత్రం ఇటు గ్రామంలో అటుకొండపైన ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు వైద్యనాథేశ్వర ఆలయంలో, అలాగే కొండపైన చెన్నకేశవస్వామి ఆలయంలో అంకురార్పణ గావించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అఖిల్, రాజేశ్‌లు పుట్టమన్ను తీసుకువచ్చి అంకురార్పణను గావించారు. అనంతరం పుట్టమన్నును ఆ పాలికలో ఉంచి పూజలు చేశారు. అనంతరం నవ ధాన్యాలను ఆ పాలికలో ఉంచి ఉత్సవాలు ప్రారంభించారు. కొండమీద ఆలయ అర్చకులు అఖిల్‌దీక్షితులు మేదిని పూజ చేశారు. ముందుగా శివకేశవులకు అమ్మవార్లకు అభిషేకాలు చేశారు. అనంతరం మేళతాళాలతో ఉత్సవాలు ప్రారంభించారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వివిధ హోమాలు ఉంటాయని, రాత్రివేళలో శివకేశవులు ఇద్దరూ వాహనంపై కూర్చుని గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు.

దస్తగిరి ప్రచార రథంపై ఇటుకలతో దాడి

- ఫ్లెక్సీ చింపేసిన వైసీపీ అభిమానులు

పులివెందుల, మే 5: పులివెందుల ఎమ్మెల్యే అభ్యర్థిగా జైభీమ్ పార్టీ తరఫున బరిలో ఉన్న దస్తగిరి ప్రచార రథంపై వైసీపీ అభిమానులు ఇటుకలతో దాడి చేశారు. పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గ స్థానానికి వివేకా హత్య కేసు అప్రూవర్ దస్తగిరి పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. తనను నామినేషన్ వేయనివ్వకుండా వైసీపీ నేతలు బెదిరించారని, ఐదుకోట్లు ఇస్తాం.. నామినేషన్ వేయొద్దని చెప్పారని అప్పట్లో దస్తగిరి మీడియాకు చెప్పారు. ఎట్టకేలకు చివరి రోజైన ఏప్రిల్ 25వ తేదీ మధ్యాహ్నం ఇతను పులివెందులలో నామినేషన్ వేశారు. అదేరోజు సీఎం వైఎస్ జగన్ సైతం నామినేషన్ వేశారు. ఇటీవల దస్తగిరి ప్రచార రథం ఏర్పాటు చేసుకుని తనకు ఓటు వేయాలంటూ పులివెందుల ప్రజలను రికార్డెడ్ పాటలు, మాటల ద్వారా అభ్యర్థిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో పులివెందుల గాంధీ సర్కిల్‌లోని నాలుగురోడ్ల కూడలి వద్ద ప్రచార రథం వస్తుండగా అక్కడే ఉన్న వైసీపీ అభిమానులు ప్రచార రథానికి ఉన్న లౌడ్ స్పీకర్‌పై ఇటుకలు విసిరారు. దీనితో ఒక లౌడ్ స్పీకర్ పాక్షికంగా దెబ్బతింది. అలాగే ఫ్లెక్సీని చింపేశారు. తన ప్రచార రథంపై దాడి చేయడంతో దస్తగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు.



దస్తగిరి ప్రచార రథానికి చిరిగిన ఫ్లెక్సీ

వడదెబ్బతో ఇరువురు వృద్ధులు మృతి

● కొండాపురంలో ఒకరు, మైదుకూరులో మరొకరు

కొండాపురం, మే 5: మండలంలోని పెంజి అనంతపురం గ్రామానికి చెందిన గురమ్మ(70) అనే వృద్ధురాలు వడదెబ్బతో మృతి చెందింది. గురమ్మ శనివారం పశువుల పేడ కోసం బయటకు వెళ్ళింది. ఎంతకూ ఇంటికి రాకపోయేసరికి ఆదివారం ఈమె కుమారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిమ్మాపురం పొలాల వద్ద కంపచెట్లలో ఈమె మృతదేహాన్ని ఆదివారం గుర్తించారు.విపరీతమైన ఎండలో తిరగడం వల్ల వడదెబ్బతో ఈమె మృతి చెందినట్లు భావిస్తున్నారు. ఈమె కుమారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొండాపురం ఎస్‌ఐ యోగీంద్ర తెలిపారు.

మైదుకూరులో: స్థానిక ఎంపీడీవో కార్యాలయం సముదాయంలో అపస్మారక స్థితిలో పడి ఉన్న వృద్ధుడిని స్థానిక పోలీసులు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతని వద్ద ఉన్న ఆధార్‌కార్డు సమాచారం మేరకు గాదె మురళీకృష్ణ (60), వల్లూరి వారితోట 7వ లైన్ గుంటూరుకు చెందిన వాసిగా పోలీసులు గుర్తించారు. కాగా మురళీకృష్ణ వడదెబ్బతోనే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నట్లు సమాచారం.

కేసీకి సాగునీరు లేనట్లేనా..?

● రబీలో రెండవ పంట హుళక్కే

చాపాడు, మే 5: ఈ ఏడాది కేసీ కెనాల్‌కు పుష్కలంగా సాగునీరు రాకపోవడంతో రైతులు పంటలను పూర్తిస్థాయిలో సాగు చేయలేకపోయారు. 2023 ఖరీఫ్ సీజన్‌లో అరకొరగా సాగునీరు రావడంతో ఆరుతడి పైర్లు సాగు చేశారు. ఇప్పుడు రబీ సీజన్‌లో సుమారు 90 శాతం పంటలను సాగు చేయలేదు. ప్రతి ఏడాది కేసీ కెనాల్‌కు శ్రీశైలం రిజర్వాయర్ నుంచి జూలై లేదా ఆగస్టు నెలల్లో సాగునీరు వచ్చేది. కానీ గత ఏడాది వర్షాలు పుష్కలంగా పడకపోవడంతో సాగునీరు కరువైంది. రైతులు జొన్న, మినుము, వరి వంటి పంటలు తక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. ప్రభుత్వం డిసెంబరు నెలలోనే కేసీ కెనాల్‌కు సాగునీరు నిలిపివేసింది. దీంతో రబీ సీజన్‌లో రైతులు పంటలు సాగు చేయలేదు. మండలంలో ఎక్కడ చూసినా బీడు భూములు దర్శనమిస్తున్నాయి. ప్రతి ఏడాది వరి పైరు సుమారు 26 వేల ఎకరాల్లో సాగు చేసేవారు. కానీ ఈ రబీ సీజన్‌లో కేవలం 2,500 ఎకరాల్లో వ్యవసాయ ఫిల్టర్ల కింద మాత్రమే వరిపైరు సాగు చేశారు. పచ్చని పైర్లతో కళకళలాడే మండలం సాగునీరు లేకపోవడంతో ఎడారిలా కనిపిస్తోంది. విశ్వనాథపురం, లక్ష్మిపేట, సీతారామపురం, పల్లవోలు, ఖాదర్‌పల్లె, చియ్యపాడు, సోమాపురం, ఇంకా పలు గ్రామాల పరిధిలో బీడు భూములుగా ఉన్నాయి. పైర్లు సాగు చేయకపోవడంతో రైతులు వీధుల్లోని అరుగులపై కూర్చొని మాటామంతీ చెప్పుకుంటూ కాలం గడుపుతున్నారు. వ్యవసాయ కూలీలకు కూలి పనులు లభించలేదు. కొంతమంది మహిళా కూలీలు పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారు. ప్రతి ఏడాది రైతులు, కూలీలు ఆహారం కోసం వరి ధాన్యం ఇళ్లలో నిలువ చేసుకునేవారు. కానీ పంట పండనందున వరి ధాన్యం ధర విపరీతంగా పెరిగాయి. జిలకర మసూర, జగిత్యాల, ఎన్‌డీఎల్‌ఆర్ వంటి వరి ధాన్యం పుట్టి (8 బస్తాలు) కొత్తవి రూ.14 వేలు ధర పలుకుతున్నాయి. ఇంత ధర పెట్టి కొనుగోలు చేయాలంటే పేదలు ఇబ్బంది పడుతున్నారు. పశువులకు మేత కూడా లభించలేదు. కేసీ కెనాల్‌కు ఉప కాలువలైన చాపాడు చానెల్, ఏటూరు కాలువల ద్వారా మండలంలోని గ్రామాలకు సాగునీరు అందుతుంది. పంటలు సాగు చేయకపోవడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



కాలువలో నీరు ప్రవహించని దృశ్యం



చాపాడు వద్ద బీడుగా ఉన్న భూములు

5 ఎకరాల భూమి బీడుగా ఉంది

- ద్వార్శల వీరారెడ్డి, రైతు, లక్ష్మిపేట గ్రామం



కేసీ కెనాల్‌కు సాగునీరు రానందున రబీ సీజన్‌లో పంట సాగు చేయలేదు. అయిదు ఎకరాల భూమి బీడుగా ఉంది. ప్రతి ఏడాది వరి, పసుపు, మినుము వంటి పంటలు సాగు చేసేవాడిని. కానీ ఈ రబీ సీజన్‌లో సాగు చేయలేదు. పశువులకు మేత కూడా లేదు. ఇప్పుడు కొత్త వరి ధాన్యం పుట్టి (8 బస్తాలు) రూ.18 వేలు ధర పలుకుతున్నాయి.

కౌలుకు భూమి చేసుకుంటున్నాను

- నాగేశ్వరరెడ్డి, రైతు, సీతారామపురం గ్రామం



కౌలుకు నాలుగు ఎకరాల భూమి సాగు చేసుకుంటున్నాను. కాలువలకు సాగునీరు రాలేదు. దీంతో భూమి ఇప్పుడు బీడుగా ఉంది. రబీ సీజన్ మొదట్లోనే కాలువకు అధికారులు సాగునీరు బంద్ చేశారు. లేకుంటే మినుము, పెసర, కూరగాయలు వంటి పంటలు సాగు చేసేవాడిని.

నేడు పోలింగ్ అధికారులకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం

● జిల్లా ఎన్నికల అధికారి

కడప(కలెక్టరేట్) మే 5: సోమవారం 6న కూడా ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలింగ్ అధికారులు తమ పోస్టల్ బ్యాలెట్ ఓటు నమోదు చేసుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కేటాయించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 5న పోస్టల్ బ్యాలెట్ అనివార్య కారణాల వల్ల నమోదు చేసుకోలేకపోయిన ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీవోలు, మైక్రో అబ్జర్వర్లు 6న కూడా తమకు కేటాయించిన నియోజకవర్గ ఫెసిలిటేషన్ పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యుత్తు షాక్‌తో రైతు మృతి



విద్యుత్తు షాక్‌తో మృతి చెందిన రామిరెడ్డి

ఖాజీపేట, మే 5: మండల పరిధిలోని సిద్ధాంతిపురం గ్రామానికి చెందిన కందుల రామిరెడ్డి (52) అనే రైతు విద్యుత్తు షాక్‌తో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్లితే... సిద్ధాపురం గ్రామానికి చెందిన రామిరెడ్డి తన పంట పొలంలో మోటారు వేసేందుకు వెళ్లి విద్యుత్తు షాక్‌కు గురయ్యాడు. పొలం దగ్గరకు వెళ్లి ఎంతసేపటికి రాకపోవడంతో ఫోన్ చేయగా ఎత్తకపోగా అనుమానం వచ్చి పొలం దగ్గరకు వెళ్లితే విద్యుత్తు షాక్‌కు గురై కిందపడి ఉండటాన్ని గమనించిన బంధువులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించడంతో ఆమేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

‘సూపర్‌సిక్స్’తో పేదల జీవితాల్లో వెలుగు

● కూటమి అభ్యర్థిని గెలిపించండి ● కడప పార్లమెంటు అభ్యర్థి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి



ఎర్రగుంట్ల మండలంలోని తిప్పలూరు కన్వెన్షన్ సెంటరులో మాట్లాడుతున్న రాజ్‌నాథ్‌సింగ్, వేదికపై భూపేష్‌రెడ్డి ఆదినారాయణరెడ్డి



కడప పార్లమెంటు అభ్యర్థి భూపేష్‌రెడ్డికి మద్దతు తెలిపిన ఐటీ వింగ్ ఉద్యోగులు, పక్కన నంద్యాల కొండారెడ్డి

(కడప - ఆంధ్రజ్యోతి): పేదలను ధన వంతులుగా మార్చేందుకు టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి సూపర్‌సిక్స్ పథకాలను ప్రవేశపెట్టిందని, చంద్రబాబు సీఎం అయితే ఆ పథకాలు అమలై పేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతాయని టీడీపీ కడప పార్లమెంటు ఎన్‌డీకే కూటమి అభ్యర్థి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని అమృతనగర్‌లో ఎన్‌డీఏ అభ్యర్థి వరదరాజులరెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ జగన్‌పాలనలో జనం బతుకులు తల్లకిందులయ్యాయన్నారు. వైసీపీ నేతలు తప్ప పేదలంతా నష్టపోయారని చంద్రబాబును గెలిపిస్తే సూపర్‌సిక్స్ పథకాలతో అందరూ బాగుపడతారన్నారు. ఎర్రగుంట్ల మండలం తిప్పలూరు సమీపంలోని ఏకేఆర్ ఫంక్షన్ హాలులో ఎన్‌డీఏ కూటమి ఎన్నికల ప్రచార సభ, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. కార్యక్రమానికి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, జమ్మలమడుగు అసెంబ్లీ అభ్యర్థి ఆదినారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి మేనిఫెస్టోను ఇంటింటికీ తీసుకెళ్లాలన్నారు. డబుల్ ఇంజను సర్కారుతో రాష్ట్రం బాగుపడుతుందన్నారు. కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలన్నారు.

వంద మోకాలిమార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతం

కడప(సెవెన్‌రోడ్స్), మే 5: రాయలసీమలో మొట్ట మొదటిసారిగా విద్యాసాగర్ హాస్పిటల్, కడపలో రోబెటిక్ టెక్నాలజీని ఉపయోగించి 100 మోకాలి కీళ్లమార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించినట్లు డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 2009లో కడపలో సాంప్రదాయ పద్ధతిలో (కన్వెన్షనల్) మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు ప్రారంభించి మెరుగైన ఫలితాల కోసం 2019లో కంప్యూటర్ నావిగేషన్ టెక్నాలజీని పరిచయం చేశామన్నారు. అత్యాధునిక ప్రపంచ స్థాయి రోబెటిక్ టెక్నాలజీని 2024లో రాయలసీమలో మొట్టమొదటసారిగా కడప నగరానికి తీసుకువచ్చినట్లు వివరించారు. రోబోటిక్ టెక్నాలజీ ద్వారా ప్రతి పేషంటుకు పర్సనలైజ్డ్ ప్లానింగ్ ద్వారా మోకాలి 3డి ఇమేజెస్ సహాయంతో సర్ఫేస్ మ్యాపింగ్ ద్వారా సబ్ మి.మీ. స్థాయిలో 100 శాతం ఖచ్చితత్వంతో మోకాలి పరికరాన్ని అమర్చుతున్నట్లు తెలిపారు. తద్వారా పేషంటు తక్కువ కాలంలోనే రికవరీ, మోకాలు పరికరాలు ఎక్కువ కాలం మన్నిక, సాధారణ మోకీలు అనే భావన, తక్కువ బ్లడ్ టిష్యూలాస్ వంటి అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. గత కొన్నేళ్లుగా 6 వేలకు పైగా మోకీలు శస్త్రచికిత్సలు చేసిన అనుభవంతో పాటు అత్యాధునిక ప్రపంచస్థాయి రోబోటిక్ టెక్నాలజీ వినియోగంతో మరింత సత్ఫలితాలు సాధించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీలక్ష్మి, హాస్పిటల్ సిబ్బంది, నగరానికి చెందిన ప్రముఖ డాక్టర్లు, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ, ఇంటాక్ ప్రతినిధులు విద్యాసాగర్ హాస్పిటల్ వారు చేసిన విశేష కృషిని అభినందిస్తూ డాక్టర్ విద్యాసాగర్, హాస్పిటల్ సిబ్బందిని సత్కరించారు.



కేక్‌కట్ చేస్తున్న డాక్టర్ విద్యాసాగర్, సిబ్బంది

మార్పు కోరుకుంటోంది

● మూడో పర్యాయం ఓటమి ముప్పు తప్పదా..? ● టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ గెలుపుపై ధీమా
● హ్యాట్రిక్ కొట్టేందుకు వైసీపీ అభ్యర్థి రఘురాముడి ఎత్తులు ● సూపర్‌సిక్స్ పథకాలతో టీడీపీ వైపు జనం మొగ్గు

మైదుకూరు, మే 5: రాయలసీమ కూడలి మైదుకూరు నియోజకవర్గం ఈ ఎన్నికల్లో మార్పుకోరుకుంటోంది. 1967 నుంచి ఇప్పటి వరకు జరిగిన శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఎవరైనా రెండు సార్లు గెలిస్తే మూడో సారి ఓడి పోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇదే క్రమంలో మైదుకూరులో టీడీపీ గెలిచే ఛాన్స్ ఉంటుందని విశ్లేషకుల అభిప్రాయం. 1955 నుంచి జరిగిన అసెంబ్లీ ఎన్నికలు మొదలు ఒకేసామాజికవర్గ అభ్యర్థినే ఎమ్మెల్యేగా ఎన్నుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మైదుకూరు నియోజకవర్గం అభివృద్ధిపై కినుక వహించడం, శంకుస్థాపన చేసిన శిలాఫలకాలు ఇప్పటికీ వెక్కిరిస్తుండడం, ఎమ్మెల్యే రఘురామిరెడ్డిపై వ్యతిరేకత పుట్టాకు కలిసొచ్చేలా ఉంది. ఇవన్నీ ఒక ఎత్తయితే వరుసగా రెండు పర్యాయాలు గెలిచిన ఎవరికైనా మూడో పర్యాయం ఓటమి తప్పదనే గత చరిత్ర పునరావృత్తం అవక తప్పదని విశ్లేషకులు భావిస్తున్నారు. రెండు దఫాలుగా టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ ఓటమి చవిచూడడంతో ఈ ఎన్నికల్లో సానుభూతి కూడా గెలుపుపై ఓ కారణంగా చెప్పవచ్చు. వివరాల్లోకెళితే....

రాయలసీమకు నడిబొడ్డు, ఉద్యమాల గడ్డగా పేరొందిన మైదుకూరు నియోజకవర్గం 1955లో ఏర్పడింది. మొట్టమొదటి ఎమ్మెల్యేగా స్వాతంత్ర సమరయోధుడు బొమ్ము రామారెడ్డి గెలుపొందారు. పాతికేళ్ల వయసులోనే 1962లో రెండో ఎమ్మెల్యేగా విజయం పొందిన స్వతంత్ర అభ్యర్థి పాలకొలను నారాయణరెడ్డి పోరుమామిళ్ల వాసి. నియోజకవర్గానికి పలు దఫాలు మంత్రి పదవులు వరించినా నియోజకవర్గం ప్రజలు ఎవరికీ హాట్రిక్ ఇవ్వక పోవడంతో ప్రజా బలం సాధించాలంటే కత్తిమీద సాములాంటిదేనని నేతలు చెప్పేవారు. బలిజ సామాజిక వర్గీయులే గెలుపోటములను శాశించగలరని తెలుస్తోంది.

ప్రధాన నగరాలైన హైదరాబాదు, బొంబాయి, కలకత్తా, చెన్నై, బెంగుళూరు తదితర నగరాలకు అనుసంధానిస్తూ రాయలసీమ ప్రాంతాల ప్రధాన కూడలిగా మైదుకూరు నిలిచింది. ఇంతటి ఘన చరిత్ర కలిగిన నియోజకవర్గంలో ప్రస్తుతం టీడీపీ తరపున పుట్టా సుధాకర్ యాదవ్ బరిలో ఉండగా వైసీపీ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పోటీ చేస్తున్నారు. ఇప్పటికే ఎన్నో అపవాదులు, ప్రజావ్యతిరేక విధానాలతో వ్యతిరేకత మూట కట్టుకున్న రఘురామిరెడ్డి ఎన్నికపై విశ్లేషకులు పలు అనుమానలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూములు, ప్రైవేట్ స్థలాల ఆక్రమణలు, ఇసుక, మట్టి మాఫియా, కమీషన్ల పర్వం తోడై ఆయనపై ప్రజలకే కాదు ఆ పార్టీ నేతల్లోనే తీవ్ర అసంతృప్తి నెలకొంది. దాదాపు లక్ష ఎకరాల సాగు కోసం రాజోలి రిజర్వాయర్ నిర్మించేందుకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అప్పట్లో శంకుస్థాపచేసినా ఆయన కుమారుడు ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నిర్మాణ పనులు చేపట్ట లేదు. అంతేకాదు పనుల కోసం శిలాఫలకం వేసినా ఇంత వరకూ గంప మట్టికూడా తీయలేదు. దీంతో రైతుల ఆశ నిరాశే అయ్యింది. ఇటీవల ఎన్నికల ప్రచారం నిమిత్తం మైదుకూరుకు వచ్చిన సీఎం జగన్ మళ్లీ అధికారం చేపట్టేందుకు రాజోలి జలాశయంపై అవే ప్రకటనలు వల్లెవేశారు. అనివార్య కారణాలతో నిర్మించలేక పోయానని తన నిర్లక్ష్యాన్ని ప్రజలకు వివరించారు. ఈ దఫా అధికారం చేపట్టిన వెంటనే రాజోలి జలాశయాన్ని నిర్మిస్తానంటూ మరో సారి ప్రజలకు హామీ ఇచ్చారు.




పుట్టా సుధాకర్


రఘురామిరెడ్డి

రెండు సార్లు గెలుపు మూడోసారి..

1967 నుంచి ఇప్పటి వరకు జరిగిన శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసి న అభ్యర్థులు ఎవరైనా రెండు పర్యాయాలు గెలిస్తే మూడో సారి ఓడి పోవడం ఆనవాయితీగా వస్తోంది. 1967, 72లో శెట్టిపల్లె పెద్దనాగిరెడ్డి, 1978, 83, 89, 94, 2004, 2009లలో డీఎల్ రవీంద్రారెడ్డి గెలుపొందా రు. కాగా 2009, 2014 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా శెట్టిపల్లె రఘురామిరెడ్డి వరుసగా రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇప్పుడు జరిగే ఈ ఎన్నికల్లో ఆయన ఓటమి చవి చూడాల్సివుంటుందని నానుడి.

వైసీపీ స్వపక్షంలో వ్యతిరేకతతోనే టీడీపీ గెలుపు

ఎమ్మెల్యే రఘురామిరెడ్డిపై స్వపక్షంలోనే తీవ్ర వ్యతిరేకత ఉంది. రెండేళ్లగా మున్సిపల్ ఛైర్మన్ పనుల్లో భాగంగా ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వైసీపీ నుంచి బలమైన నేతలు బీపీ సుధాకర్, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ బీఎన్ శ్రీనివాసులు, జిల్లా పార్లమెంటరీ వైసీపీ కార్యదర్శి కూశెట్టి రాయుడు, వైసీపీ యువజన సంఘం జిల్లా కార్యదర్శి తప్పెట శశిధర్ రెడ్డి తదితరులు టీడీపీలో చేరారు. దీంతో టీడీపీ గెలుపు సునాయాసమని చెప్పవచ్చు. రాష్ట్రంలో వైపీపీ గాలి వీస్తున్న సమయంలోనూ మైదుకూరు, బద్వేలు మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ విజయఢంకా మోగించింది. ఇప్పటికే బలిజ వర్గీయుల్లో బలమైన నేతలు పుట్టా సుధాకర్ గెలుపు కోసం కృషిచేస్తున్నారు. యాదవ కులస్థులు సైతం ఈ దఫా తమ వర్గీయుడిని గెలిపించాలని కృతనిశ్చయంతో ఉన్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,11,855 ఓటర్లు ఉండగా అన్నివర్గాలు కలిసి సుమారు 80 శాతం మంది పుట్టాకు ఓటు వేసే అవకాశం ఉంది.

నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్, వైసీపీ అభ్యర్థి రఘురామిరెడ్డి బలాలు, బలహీనతలు పరిశీలిస్తే...

టీడీపీ పుట్టా సుధాకర్ యాదవ్ బలాలు

- ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండటం
- టీటీడీ ఛైర్మన్‌గా ఉండగా దేవాలయాలకు సహకరించడం
- రెండు మార్లు ఓటమి చెందాడన్న సానుభూతి
- వైసీపీ నుంచి బలమైన నేతలు టీడీపీలో చేరడం
- అధికార పార్టీ దాడులపై కార్యకర్తలకు అండగా ఉండటం
- అవసరం ఉన్న వారిని ఆర్థికంగా ఆదుకోవడం
- టీడీపీ ప్రభుత్వంలో నియోజకవర్గం అభివృద్ధికి రూ.900 కోట్లు మంజూరు చేయించడం
- మైదుకూరు పరిధిలో చెరువులకు నీరు నింపేలా శాశ్వత జీవో తీసుకురావడం
- మైదుకూరు ఉర్దూ జూనియర్ కళాశాల ఏర్పాటు
- మున్సిపల్ పరిధిలో ఇంటింటికీ తాగునీటి సరఫరాకు రూ.89 కోట్లు మంజూరు చేయించడం

బలహీనతలు

- అందరినీ గుడ్డిగా నమ్మడం
- రాజకీయ అనుభవం లేక పోవడం
- తన సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇస్తున్నారనే అపవాదు

ఎమ్మెల్యే రఘురామిరెడ్డి బలాలు

- జగన్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు
- స్థానికంగా అందుబాటులో ఉండడం


బలహీనతలు

- రాజోలి రిజర్వాయర్ నిర్మించలేక పోవడం
- తాగు, సాగునీటి కోసం కుందూనదిపై ఎత్తిపోతల పథకం చేపట్టక పోవడం
- పట్టణాభివృద్ధిలో వైఫల్యం
- పట్టణ సుందరీకరణలో నిర్లక్ష్యం
- వంద పడకల ఆస్పత్రి అమలుకు నోచుకోక పోవడం
- వైసీపీలో వ్యతిరేకత, బలమైన నేతలు పార్టీని వీడడం
- కేపీ ఉల్లి పరిశోధన సంస్థ, శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయలేక పోవడం
- మైదుకూరు అభివృద్ధి, సందరీకరణ పనులు చేపట్టక పోగా రోడ్డు డివైడర్లు కొట్టేస్తున్నా మౌనం వహించడం
- స్వపక్షం నేతలకు పనులు ఇవ్వక పోవడం
- బలమైన నేతలు టీడీపీలోకి వెళుతున్నా నిరోధించలేక పోవడం
- కుమారుడు పలు విషయాల్లో జోక్యం చేసుకుంటున్నాడని వైసీపీ నేతలు చెబుతున్నా వారించకపోవడం.

సుందరీకరణ యూటర్న్

● శ్రీకాంత్‌రెడ్డి గారూ... అభివృద్ధి ఏమైంది సారూ....?
● పార్కింగ్ స్థలంగా మారిన గ్రాస్‌ల్యాండ్ ● కనుమరుగవుతున్న మొక్కలు
● విద్యుత్ స్తంభాలు తొలగించకుండానే సిమెంటు రోడ్డు వేశారు
● ఇదీ రాయచోటి మున్సిపాలిటీ సుందరీకరణ పనుల దుస్థితి


బస్టాండు రోడ్డులోని డివైడర్‌లో కనుమరుగైన చెట్లు



రాయచోటిటౌన్, మే5: స్పెషల్‌గ్రేడ్ మున్సిపాలిటీగా మార్చారు. ఎంతో సుందరంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి జగన్, నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన గడికోట శ్రీకాంత్ రెడ్డి గొప్పగా ప్రకటించారు. సుందరీకరణ పనులు అంటూ ఐదేళ్ల పుణ్యకాలం గడిచిపోయినా పనులు చేసినట్లు ఎక్కడా కనిపించడం లేదు. కాలక్రమేణా పట్టణం అన్నమయ్య జిల్లా కేంద్రంగా రూపుదిద్దుకుంది. ఇక అభివృద్ధి పరుగులు తీస్తుంది అనుకున్న పట్టణ ప్రజలకు నిరాశే మిగిలింది. రాయచోటి మున్సిపాలిటీ నుంచి గ్రేడ్-1 మున్సిపాలిటీగా, స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయినా అభివృద్ధి పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. దీంతో పట్టణ ప్రజలు పట్టణ సుందీకరణపై అధికార పార్టీ నేతల వైఖరిని ఎండగడుతున్నారు.

కనిపించని సుందీకరణ పనులు

అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో సుందీకరణ పనులు కనిపించడం లేదు. గతంలో ఎన్జీవో కాలనీలో ఏర్పాటు చేసిన డివైడరు మధ్యలో సుందరమైన మొక్కలు ఉండేవి. దాన్ని తొలగించి రోడ్డు వెడల్పు చేసి మరింత సుందరంగా డివైడర్ ఏర్పాటు చేసి కాలనీలో ఆహ్లాదకర వాతావరణాన్ని ఏర్పాటు చేస్తామన్న నేతల ప్రకటనలు కాగితాలపైనే నిలిచాయి. దీంతో ఎన్జీవో కాలనీ వాసులు అధికార పార్టీనేతల పనితీరుపై పెదవి విరుస్తున్నారు. నేతాజీ సర్కిల్ నుంచి బస్టాండు వరకు ఉత్తరం వైపున ఆక్రమణలు తొలగించి డ్రైనేజీ ఏర్పాటు చేసి సిమెంటు రోడ్డు నిర్మించారు. దక్షిణం వైపున ఆక్రమణలు తొలగించి డ్రైనేజీ ఏర్పాటు చేశారే కానీ రోడ్డు వేయకుండా విద్యుత్ స్తంభాలు తొలగిం చకుండా అలాగే వదిలేశారు. దీంతో వాహనదారు లు నిత్యం ట్రాఫిక్ సమస్యతో నానా ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. విద్యుత్ స్తంభాలు రోడ్డు మధ్యలో ఉండడంతో స్థంభాలకు ఇటువైపు వాహ నాలు నిలబెట్టినప్పుడు ఆర్టీసీ బస్సులు, ఇతర పెద్ద వాహనాలు వెళ్లాలంటే సమస్యగా మారింది. నేతాజీ సర్కిల్ నుంచి బస్టాండు వరకు డివైడర్ మధ్యలో ఉన్న మొక్కలను సంరక్షించే నాధుడే కరువయ్యాడు. ఫలితంగా డివైడర్‌కు మధ్యలో రోజు రోజుకూ మొక్కలు కనుమరుగుతున్నాయి. దీంతో బస్టాండు రోడ్డు కళావిహీనంగా మారుతోంది.

పార్కింగ్ అడ్డాగా గ్రాస్‌ల్యాండ్ స్థలం

జాతీయ రహదారి పక్కన ఎస్ఎన్ కాలనీలో గ్రాస్‌ల్యాండ్ స్థలంలో చిరు వ్యాపారంతో కుటుంబాలను పోషించుకునే దుకా ణాలపై 2018లో మున్సిపల్ వైసీపీ పాలక వర్గం ఆధ్వర్యంలో ఆక్రమణలను తొలగించారు. సుమారు ఏడేళ్లు గడుస్తున్నా ఇంతవరకూ ఆస్థలంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో ఆ స్థలం ప్రైవేటు వాహనాలకు పార్కింగ్‌గా మారింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రాస్‌ల్యాండ్ స్థలాన్ని పార్కుగా మార్చి పట్టణ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందిస్తామని ప్రకటించిన ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి వైసీపీ పాలన ముగిసినా ఆ స్థలం జోలికి వెళ్లకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా మున్సిపల్, జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపి గ్రాస్‌ల్యాండ్ స్థలాన్ని అభివృద్ధి చేసి పట్టణ ప్రజలకు పచ్చని ఆహ్లాదకర వాతావరణం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

సర్కిల్స్‌లో యూటర్న్ పనులు గాలికి....

పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే ఠాణా సర్కిల్, నేతాజీ సర్కిల్ ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను నియంత్రిం చేందుకు యూటర్న్ ఏర్పాటు చేయాలని ఆక్రమణలు తొలగించారు. ఎమ్మెల్యే చొరవతో మున్సిపల్, రెవెన్యూ, ఆర్‌అండ్ బీ అధికారులు కలిసి చేసిన యూటర్న్ పనులు సైతం గాలికి వదిలేశారు. సిగ్నల్స్ వద్ద యూటర్న్ తీసుకోవాలనే ఉద్దేశంతో ఏడాది కిందటే ఆక్రమణలు తొలగించినా అక్కడ ఎలాంగ్భజీ1టి పనులు చేపట్టకపోవడంతో సర్కిల్స్‌లో కూడా వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో ఆక్రమణ తొలగించిన ప్రాంతంలో దుకాణా లు ఏర్పాటవడం, ఆక్రమణల తొలగింపు ప్రాంతం లో తిరిగి నిర్మాణాలు చేపడుతుండడంతో ట్రాఫిక్ సమస్య మళ్లీ మొదటికొచ్చే అవకాశాలు ఉన్నాయ ని పట్టణ ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు. నేతాజీ సర్కిల్ వద్ద నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం ఎడమైపున, కుడివైపున యూటర్న్ కోసం ఆక్రమణ తొలగించి ఏళ్ల గడిచాయి. ఇంతవరకూ పనులు చేపట్టకపోవడంతో రెండు వైపులా దుకాణాలు యధావిధిగా సాగుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రత్యేక చొరవ చూపి ఠాణా సర్కిల్, నేతాజీ సర్కిల్ వద్ద యూటర్న్ కోసం ఆక్రమణలు తొలగించిన ప్రాంతంలో పనులు చేపట్టి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజ లు జిల్లా అధికారులను కోరుతున్నారు.

స్తంభాలు తొలగించకుండానే రోడ్డు

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లగా రాయచోటి మున్సిపాలిటీలో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టని అధికార పార్టీ నేతలు ఎన్నికల సమీపిస్తుండడంతో ఆగమేఘాలపైన పలు ప్రాంతాల్లో కనీసం విద్యుత్ స్తంభాలు కూడా తొలగించకుండానే సిమెంటు రోడ్డు నిర్మాణం పనులు రాత్రి, పగలు తేడా లేకుండా చేపట్టారు. మదనపల్లె రోడ్డు నుంచి సుద్దలవాండ్లపల్లెకు వెళ్లే రోడ్డులో మధ్యలో ఉన్న విద్యుత్ స్థంభాలను తొలగించకుండానే ఆగమేఘాలపైన సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో ఆ మార్గం గుండా భారీ వాహనాలు వెళ్లాలంటే విద్యుత్ స్తంభాలు అడ్డుగా నిలుస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో సిమెంటు రోడ్లు వేసినా సరైన క్యూరింగ్ కూడా చేసిన దాఖలాలు మనకు కనిపించడం లేదు. దీనికి తోడు ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ ఇటీవల రెండు రోజుల కిందట పట్టణంలోని భట్టువీధి, వాసవీ గ్రాఫిక్స్ వీధి తదితర ప్రాంతాల్లో సిమెంటు రోడ్డు నిర్మాణాలను చేపట్టారు. నిత్యం అధికారులు పట్టణంలో తిరుతున్నా ఇలాంటి సమస్యలు వారికి కనిపించినట్లు లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు.


బస్టాండు రోడ్డులో విద్యుత్ స్తంభాలు తొలగించకుండా వదిలేసిన దృశ్యం


వాహనాల పార్కింగ్‌గా మారిన గ్రాస్‌ల్యాండ్ స్థలం


సుద్దలవాండ్లపల్లె రోడ్డులో స్థంభాలు తొలగించకుండానే వేసిన సిమెంటు రోడ్డు


ఎన్జీఓ కాలనీలో డివైడర్‌ను తొలగించి పనులు చేపట్టకుండా వదిలేసిన దృశ్యం

ఒక్క ఓటే కదా ...

ఒక్క ఓటు అంటూ నిర్లక్ష్యం తగదు

● దేశంలో సింగిల్ డిజిట్ మెజార్టీతో ఇద్దరు ఎంపీల గెలుపు
● రాష్ట్రం నుంచి కొణతాల రామకృష్ణ



కలికిరి, మే 5: మన ఒక ఓటుతో మునిగేదేమీ లేదని, ఎవరంతకు వారు నిర్లిప్తంగా వుండిపోతారు గానీ చాలా ఎన్నికల్లో ఆ ఒక ఓటే అభ్యర్థుల కొంప ముంచుతుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో అయితే గతంలో ఒక అభ్యర్థి తన సొంత ఓటు వేసుకోకుండా నిర్లక్ష్యం చేసి ఓడియిన దృష్టాంతాలూ వున్నాయి. వేలల్లో ఓట్లుండే ఇలాంటి చిన్న ఎన్నికల్లోనే కాదు లక్షల ఓట్లుండే ఎంపీ ఎన్నికల్లో సైతం ప్రతి ఓటూ నిర్ణయాత్మక మవుతుందని చెప్పే రెండు ఉదంతాలున్నాయి. 1962 నుంచి పార్లమెంటుకు జరుగుతున్న ఎన్నికల్లో ఇద్దరు అభ్యర్థులు కేవలం 9 ఓట్ల తేడాతో విజయం సాధించారంటే ఆశ్యర్యకరమే కదా! ఉమ్మడి ఏపీలో 1989లో అనకాపల్లి ఎంపీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కొణతాల రామకృష్ణ కేవలం 9 ఓట్ల మెజార్టీతో గట్టున పడ్డారు. ఈ ఎన్నికల్లో రామకృష్ణకు 2,99,109 ఓట్లు రాగా టీడీపీ అభ్యర్థి అప్పల నరసింహంకు 2,99,100 ఓట్లు, ఇండిపెండెంట్ అభ్యర్థి వీసం సన్యాసి నాయుడుకు 35,388 ఓట్లు వచ్చాయి. ప్రస్తుతం కొణతాల రామకృష్ణ అనకాపల్లి నుంచే అసెంబ్లీ అభ్యర్థిగా జనసేన తరపున పోటీలో వున్నారు. 1998లో బీహార్‌లోని రాజ్‌మహల్ ఎంపీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన సోమ్ మరాండీ కూడా కేవలం 9 ఓట్ల తేడాతో విజయం సాధించారు. మరాండీకి 1,98,889 ఓట్లు రాగా ఆయన సమీప కాంగ్రెస్ అభ్యర్థి థామస్ హన్స్‌డా 1,98,880 ఓట్లు సాధించారు. ఇక్కడ జార్ఖండ్ ముక్తి మోర్చా అభ్యర్థి సిమోన్ మరాండీ 1,50,104 ఓట్లు, సీపీఎం అభ్యర్థి జ్యోతిన్ సోరెన్ 23,359 సాధించగా మిగిలిన ఏడుగురు ఇండిపెండెంట్లు కలి సి 14,285 ఓట్లు సాధించారు. ఇప్పటి వరకూ లోక్ సభ ఎన్నికల్లో అత్యంత అల్ప మెజార్టీ అందులోనూ సింగిల్ డిజిట్‌తో గెలుపొందిన వారు కొణతాల రామకృష్ణ, సోమ్ మరాండీ మాత్రమే ఉన్నారు.

తెలుసుకోండి.....

ప్రచారానికి పరిమితులు ఉన్నాయి



కడప (ఎర్రముక్కపల్లె), మే5: ఎన్నికల్లో పర్యావరణ చట్టాలు, నిబంధనలను నేతలంతా పాటించాలి. మైకుల గోలతో హోరెత్తిస్తే చట్టం తన పని తాను చేసుకుంటుంది. డీజే సౌండ్, పెద్దపెద్ద స్పీకర్లతో గోల చేస్తే శబ్ద కాలుష్యం కింద చేతులు పెడతామని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఏఏ ప్రాంతాల్లో ఎంత శబ్ధం అనుమతిస్తారనే వివరాలిలా ఉన్నాయి. ప్రచారంలో నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా, జైలు శిక్ష పడే అవకాశం ఉంది. నివాస ప్రాంతాల్లో 45 నుంచి 55 డెసిబుల్స్ శబ్ధ తీవ్రత ఉండాలి. వైద్యశాలలు, విద్యాలయాలు, న్యాయస్థానాల సమీపంలో 40 నుంచి 50, వ్యాపార ప్రాంతాల్లో 55 నుంచి 65, పారిశ్రామిక ప్రాంతాల్లో 70 నుంచి 75 డెసిబుల్స్ మించి శబ్ధం చేయకూడదు.

గతంలో 21 ఏళ్లకు మాత్రమే ఓటు హక్కు!

కలికిరి, మే 5: దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మొదటిసారిగా 25 అక్టోబరు 1951, 21 ఫిబ్రవరి 1952 మధ్య సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. అప్పటి నుంచి ఓటు వేసేందుకు కనీస వయసు 21 ఏళ్లుగా వుండేది. అంటే 21 సంవత్సరాలు నిండిన వారు మాత్రమే ఓటు వేసేందుకు అర్హులు. ఈ విధానం 1985 ఎన్నికల వరకూ కొనసాగింది. తరువాత రాజీవ్ గాంధీ ప్రధానిగా వున్న రోజుల్లో 1988లో 61వ రాజ్యాంగ సవరణ ద్వారా 18 ఏళ్లకు ఓటు హక్కు కల్పించారు. 1989 ఎన్నికల నుంచి ఈ కొత్త విధానం అమల్లోకి వచ్చింది. దీంతో 18 ఏళ్లు నిండిన యువతీ యువకులందరికీ ఓటర్ల జాబితాలో చోటు లభించింది. యువ ఓటర్లు ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికలో క్రియాశీలకమైన నిర్ణయాత్మక పాత్ర పోషించడం ఆరంభమైంది.

ఆర్భాటపు హామీ ... నెరవేరలేదేమీ...


శెట్టివారిపల్లె గ్రామం

ముద్దనూరు మే5:జగనన్న సీఎం అయితే శెట్టివారిపల్లె గ్రామాన్ని గండికోట ప్రాజెక్టు బ్యాక్ వాటర్ మునక కింద చేర్చి, పరిహారం అందేలా చేస్తామని వైసీపీని గెలిపించాలని ఎంపీ అవినాష్‌రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి గత ఎన్నికల సమయంలో ఆర్భాటంగా గ్రామస్థులకు హామీ ఇచ్చారు. అవి మాటలకే పరిమితమయ్యాయి. వివరాల్లోకి వెళితే... శెట్టివారిపల్లె గండికోట ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌కు అతి చేరువలో ఉంది. అంతేకాకుండా గాలేరు-నగిరి కాల్వ గ్రామం ముందు నుంచి ఏర్పాటు చేశారు. గ్రామం కూడా నేషనల్ హైవే కు 2కిలో మీటర్ల దూరంలో నున్న కొండ ప్రాంతంలో ఉంది. ఈగ్రామానికి వెళ్లాలంటే రహదారి కూడా సక్రమంగా లేదు. రైల్వే వంతెన కింది నుంచి వెళ్లాలి. వర్షం పడితే రైల్వే బ్రిడ్జి కింద చేరిన వర్షపు నీటితో ప్రజలు ఇబ్బందులు పడక తప్పదు. ఊర్లోకి వెళ్లేందుకు గాలేరు-నగిరి కాల్వపై ఉన్న వంతెన వర్షకాలంలో తెగితే గ్రామంలోకి వెళ్లడం కష్టంగా ఉంటుంది. ప్రస్తుతం కాల్వపై నున్న వంతెన పరిస్థితి అధ్వాన్నంగా ఉందని, గ్రామం కొండప్రాంతంలో ఉండడం, బ్యాక్ వాటర్ దగ్గరగా ఉండడంతో చిరుతపులి సంచారం కూడా ఎక్కువగా ఉంది. రెండేళ్ల కిందట చిరుతపులి పిల్ల గ్రామ సమీప పొలాల వద్దకు వచ్చి విద్యుత్ తీగలు తగిలి మృతి చెందింది. అప్పుడప్పుడూ పొలాల్లో చిరుత జాడలు కన్పిస్తుంటాయని గ్రామస్థులు వాపోతున్నారు. టీడీపీ ప్రభుత్వంలో ప్రజల అవస్థలను గుర్తించి శెట్టి వారిపల్లె గ్రామాన్ని గండికోట బ్యాక్ వాటర్ ముంపు కింద ప్రకటించారు. ఏరియల్ సర్వే, అవార్డు కూడా అయ్యిందని ప్రజలు తెలిపారు. అయితే గ్రామంలో కొందరు ఇళ్ల సర్వేలో అవకతవకలు జరిగాయని అధికారులకు ఫిర్యాదు చేయడం నిలిచిపోయిందన్నారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల ముందు వైసీపీ నేతలు శెట్టివారిపల్లెను ముంపు గ్రామంగా ప్రకటిస్తామని గ్రామంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఆ సభలో ఎంపీ అవినాష్‌రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆర్భాటంగా రూ.10లక్షలు ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే వైసీపీ ప్రభుత్వం ఏర్పడినా ముంపు మాటే ఎత్తలేదన్నారు. ప్రజల సమస్యలను కూడా పట్టించుకోలేదన్నారు. వచ్చే ప్రభుత్వమైనా గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.


గాలేరు, నగిరి కాల్వ బిడ్జి పక్కన మట్టి కోతను చూపిస్తున్న ప్రజలు

ముంపు మాటేలేదు

గ్రామాన్ని గండికోట బ్యాక్ వాటర్ ముంపు కింద చేరుస్తామని ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు.గెలిచిన తరువాత ఇచ్చిన హామీ గురించి పట్టించుకోలేదు. ముంపు మాటేలేదు.

లక్ష్మీనారాయణ, శెట్టివారిపల్లె

బిక్కు బిక్కు మంటూ జీవిస్తున్నాం

మా గ్రామంలోకి వెళ్లాలంటే దారే సరిగాలేదు. వర్షం పడితే కాల్వపై ఉన్న బ్రిడ్జి పక్కనున్న మట్టి కుంగి పడి వెళ్లేందుకు దారిలేకుండా పోతుంది. ఎన్నికల ముందు నేతలు ఇచ్చిన హామీలు వట్టిమాటలు. చిరుత పులి సంచారంపై బిక్కు బిక్కు మంటూ జీవిస్తున్నాం.

చీమల నారాయణరెడ్డి, శెట్టివారిపల్లె

ప్రతి కార్యకర్త ఓటుహక్కు వినియోగించుకోండి




దువ్వూరు మండలం ఎర్రబల్లిలో ప్రచారం చేస్తున్న పుట్టా సుధాకర్‌యాదవ్, టీడీపీలో చేరిన సర్పంచ్ అనుచరులు

దువ్వూరు(మైదుకూరు), మే 5 : టీడీపీ అభ్యర్థి పుట్టాసుధాకర్ యాదవ్ ఇంటింటి ప్రచారం చేపడుతూనే వైసీపీ నాయకులను పార్టీలో చేర్చుకుంటున్నారు. దువ్వూరు మండలం యస్.ఎర్రబల్లిలో టీడీపీ సైకిల్ గుర్తుకే ఓటు వేయాలంటూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మ్యాని ఫెస్టో కరపత్రాలను ఇంటింటికి పంచుతూ ప్రచారం నిర్వహించారు.

మైదుకూరు..: వైసీపీ కడప పార్లమెంటరీ కార్యదర్శి కూశెట్టి రాయుడు ఆదివారం టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ప్రొద్దుటూరులోని పుట్టా నివాసానికి చేరుకొని పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, ధనపాల జగన్, లక్ష్మీనారాయణ, కటారు క్రిష్ణ పాల్గొన్నారు.

దువ్వూరు(మైదుకూరు)..: దువ్వూరు మండలం యర్రపల్లె సర్పంచ్ (వైసీపీ మద్దతుదారు) చిన్నకొమ్ముగారి మదార్‌వలితో పాటు వారు అనుచరులు దాదాపు 150 కుటుంబాల వారు ఆదివారం టీడీపీలో చేరారు.టీడీపీ అభ్యర్థిపుట్టా సుధాకర్ యాదవ్‌సమక్షంలో వైసీపీ నాయకులు వెంకట సుబ్బారెడ్డి, మధుసూదనరెడ్డి, భాస్కర్‌రెడ్డి, గౌస్ బాష తదితరుల ను టీడీపీలో చేర్చుకున్నారు. అలాగే భీమునిపాడుకు చెందిన వైసీపీ నాయకులు సుకుమార్, యేసయ్య, శాంతయ్య, రాజేష్, రంజిత్ తదితరులకు చెందిన దాదాపు 30 కుటుంబాల వారు పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలో టీడీపీలో చేరారు.

ఖాజీపేట..: ప్రతి కార్యకర్త తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, ఇన్‌చార్జి పుట్టా వెంకటస్వామి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొత్తపేట పంచాయతీ పరిధిలో, కమ్మలూరు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొమ్మలూరు శంకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు మురళీమోహన్‌రెడ్డి, లక్ష్మీదేవి, కంబాల గురివిరెడ్డి, బుచ్చిరెడ్డి, వాకమల్ల వెంకటరామిరెడ్డి, పోకల వెంకటసుబ్బారెడ్డి, శ్రీనివాసులు, వెంకటయ్య, చిన్నగురివిరెడ్డి, సుబ్బారెడ్డి, రామిరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, వెంకటరమణ, మల్లేశ్వర్‌రెడ్డి, హజరత్, సుబ్బరాయుడు, సిద్దయ్య, కటారి క్రిష్ణ, పెద్దిరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

కొత్తపేటలో టీడీపీలో 10 కుటుంబాలు చేరిక..: మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో అంబవరం బాలిరెడ్డి, అంబవరం భాస్కర్‌రెడ్డి, బుసిరెడ్డి లోక్‌నాథ్‌రెడ్డి అనుచర వర్గం టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, ఇన్‌చార్జి పుట్టా వెంకటస్వామి సమక్షంలో టీడీపీలో 10 కుటుంబాలు చేరారు.

బ్రహ్మంగారిమఠం..: మైదుకూరు నియోజకవర్గటీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్‌ను రానున్న ఎన్నికల్లో ఒక్కసారి ప్రజలం దరూ ఆదరించాలని మండల ప్రచార సమన్వయ కర్త పుట్టా ఆనంద్ యాదవ్ అన్నారు. ఆదివారం దిరసవంచ, చౌటపల్లె గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, దిరసవంచ యూనిట్ ఇన్‌ఛార్జ్ ప్రధాన కార్యదర్శి ముద్దుక్రిష్ణమ నాయుడు, నల్లిబోయిన చిన్నవీరయ్య, పొడపాటి వెంకటేశ్‌నాయుడు, భగీరధ, చిలమలనాగయ్య, మేకల సుధాకర్, రవీంద్ర, ఎల్.రమణారెడ్డి, వెంకటరత్నం, మురళి, వెంకటసుధాకర్, రామాంజనేయులు, సుదర్శన్, నాగరాజు,శివ, సుబ్రమణ్యం, నాగేంద్ర, ఈశ్వర్‌రెడ్డి, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్ ..: టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో ప్రొద్దుటూరులోని పార్టీ కార్యాలయంలో జేఆర్ రవీంద్రనగర్‌కు చెందిన 30 కుటుంబాలు పుట్టా సమక్షంలో టీడీపీ కండువాలు కప్పుకొన్నారు.చేరికకు సహకరించిన వారిలో నేట్లపల్లి మల్లికార్జున్‌యాదవ్,మల్లయ్యానాయుడు తదితరులు ఉన్నారు.



దువ్వూరు మండలం బుక్కాయపల్లె గ్రామంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీసీ సెల్ అధ్యక్షుడు పుట్టా ప్రభాకర్‌యాదవ్, మైదుకూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పందిటి మల్హోత్ర



దువ్వూరు మండలం భీమునిపాడులో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులతో పుట్టా



ఖాజీపేటలో సూపర్-6 పథకాలను వివరిస్తున్న టీడీపీ నాయకులు

జగన్ ప్రభుత్వాన్ని గద్దెదించాలి




బద్వేలు.. పూసలవాడలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్న, పోరుమామిళ్ల...కవలకుంట్ల ఎస్సీకాలనీకి చెందిన వైసీపీ కుటుంబాల వారు రితీష్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన దృశ్యం

పోరుమామిళ్ల, మే 5 : మండలంలోని కవలకుంట్ల ఎస్సీ కాలనీ-2 హరిజనవాడలోని 20 కుటుంబాలు వైసీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితీష్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఆదివారం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఆ కాలనీకి చెందిన వార్డుమెంబరు మాధవ చెన్నయ్య, చాటకొండు రామయ్య, వెంకటేశ్ శేఖర్‌లతో పాటు 20 మంది టీడీపీలో చేరారు. కవలకుంట్ల టీడీపీ నాయకులు విజయుడు, కాశినాయన మండల టీడీపీ నాయకుడు రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బలిజకోటలో 15 కుటుంబాలు బీజేపీలో చేరిక..: పోరుమామిళ్లలోని బలిజకోటకు చెందిన యనమల రజని, యనమల బ్రహ్మయ్య, కె.సుధాకర్, పోతురాజు వెంకటరమణ, గడికోట గురప్ప, తుపాకుల సిద్దయ్య తదితరులు వైసీపీ నుంచి బీజేపీలో చేరారు. ఆదివారం పోరుమామిళ్ల మండలం రంగసముద్రం గ్రామంలో జరిగిన ఎన్‌డీఏ మినీ వీధి సమావేశంలో వారు మాజీ జిల్లా ప్రెసిడెంట్ శ్రీనాధరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. కార్యక్రమానికి త్రిపుర ఇన్‌ఛార్జ్ డాక్టర్ సాయిరామ్ సంతోష్, స్థానిక నాయకులు పల్లెంశెట్టి పండరి, మాడిశెట్టి నాగేంద్ర, రమణాచారి, షకీలాబేగం తదితరులు పాల్గొన్నారు.

కలసపాడు..: మండలంలోని పెండ్లిమర్రి గ్రామంలో ఆదివారం 40 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి, గ్రామానికి చెందిన నాగిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీజడ్పీటీసీ గోపాల్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, అభిమానులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వాన్ని గద్దెదించాలి

బద్వేలుటౌన్ మే 5 : జగన్ ప్రభుత్వాన్ని గద్దెదించాలని ఎన్డీఏ కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్న అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని పూసలవాడలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతిపాలనను అంతంచేసేందుకు ఓటుతోనే వైసీపీ ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలని ఆయన అన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, శ్రీనివాసులు, దానం పాల్గొన్నారు.

అట్లూరు..: అట్లూరు మండలంలోని మాడపూర్, కమలకూరు గ్రామాల్లో ఆదివారం రితీష్‌రెడ్డి సమక్షంలో వైసీపీని వీడి 70 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు మంచూరి సూర్య నారాయణరెడ్డి, బోవిళ్ల నందగోపాల్‌రెడ్డి, పి.మల్లికార్జునరెడ్డి, అరవ శ్రీనివాసులురెడ్డి నాయకత్వంలో మాడపూరు గ్రామం నుంచి 50 కుటుంబాలు, కమలకూరు నుంచి 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. చేరిన వారు మాడాపూర్ పంచాయతీ నుంచి పరంధామరెడ్డి కమల కూరు గ్రామానికి చెందిన డీవీ రమణ, మునిరెడ్డి తదిరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మద్దిక పుల్లారెడ్డి, పోతిరెడ్డి సుబ్బారెడ్డి, మద్దిక గోపాల్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, పి.రాధాక్రిష్ణారెడ్డి, అమర్‌నాథరెడ్డి, లేవాకు రామక్రిష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్న గెలుపు కోసం టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు మండలంలోని గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారు. ఆదివారం సాయంత్రం మండలంలోని వెంకటాపురం పంచాయతీలో కూటమి అభ్యర్థి రోశన్న సతీమణి అరుణమ్మ ఇంటింటి ప్రచారం చేశారు. అలాగే గానుగపెంట పంచాయతీలోని రేపల్లెలో యువత టీం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



కలసపాడు... పెండ్లిమర్రి గ్రామంలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన దృశ్యం



అట్లూరు.. రితీశ్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వారు



పోరుమామిళ్లలో బీజేపీలో చేరుతున్న దృశ్యం

పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలు ప్రశాంతం




బద్వేలులో ఓటువేసేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలో ఉన్న ఉద్యోగులు, మైదుకూరులో ఓటింగ్ సరళిని పర్యవేక్షిస్తున్న టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్

మైదుకూరు, మే 5 : మైదుకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఆర్వో చంద్రమోహన్ పర్యవేక్షణలో గట్టి పోలీస్ బందోబస్తు మధ్య ఎన్నికలు జరిగాయి. నియోజకవర్గం పరిధిలోని ఆయా మండలాలకు చెందిన పీవో, ఏపీవో, అంగన్‌వాడీలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా ఆదివారం నిర్వహించిన పోలింగ్‌లో మొత్తం 1335ఓటర్లుండగా 1320 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా ఎన్నికల తీరును టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్, వైసీపీ అభ్యర్థి రఘురామిరెడ్డి పరిశీలించారు. కాగా సీఐ మస్తాన్, ఎస్‌ఐ మద్దిలేటి బందోబస్తుగా వ్యవహరించారు.

బద్వేలు..: బద్వేలు నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం జరిగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రశాతంగా ముగిసింది. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 2247 మంది ఓటర్లు ఉండగా ఆదివారం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ 1695 మంది తమ ఓటుహక్కును వినియోగించుకోగా 75.43 శాతం పోలింగ్ నమోదు అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆకుల వెంకటరమణ తెలిపారు. పోలింగ్ కేంద్రాలను రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు బానుదాసుఫాల్వే పరిశీలించారు. ఉదయం 7 గంటలనుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. ఆదివారం పీఓ, ఏపీవో,ఇతరులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. సోమవారం కూడా పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. కాగా పోలింగ్ కేంద్రాలను పలు పార్టీల నేతలు పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ఉద్యోగులు అయినప్పటికీ ఓటుకు నోటు అనే నినాదానికి వైసీపీ నాయకులు తెరలేపి ఉద్యోగులకు ప్రలోభాలకు గురిచేసి ఓటు ఉన్న వారికి నగదు పంపిణీ చేసినట్లు సమాచారం.

జమ్మలమడుగు..: జమ్మలమడుగులో ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి ముద్దనూరు రోడ్డులో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రాంగణంలో పోస్టల్ బ్యాలెట్ల ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఉదయాన్నే వివిధ ప్రాంతాల నుంచి ఉద్యోగులు ఓటింగ్‌లో పాల్గొనేందుకు క్యూ కట్టారు. జమ్మలమడుగులో ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఉద్యోగులు మొత్తం 1632 మందికిగాను 1503 మంది ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మొత్తం 92 శాతం ఓటు హక్కును ఉద్యోగులు వినియోగించుకున్నారని తెలిపారు.

● **ఓటర్లకు డబ్బు పంపకం..:** జమ్మలమడుగులోని పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రం పక్కనే తాతిరెడ్డి నరసింహారెడ్డి పార్కు ఆవరణంలో వైసీపీ వారు డబ్బు పంపకాలు చేశారు. అయితే పోలింగ్ కేంద్రానికి సమీపానే విచ్చలవిడిగా రోడ్డుపై డబ్బు పంపకాలు చేస్తున్నా సంబంధిత అధికారులు స్పందించలేదనే ఆరోపణలు ఉన్నాయి. అనంతరం పోలింగ్ కేంద్రం వద్దకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి రావడం, పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే వైసీపీ కండువా కప్పుకుని ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని అక్కడే ఉన్న ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి సోదరుని కుమారుడు గోవర్ధన్‌రెడ్డి ప్రశ్నించడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అప్పటికే అక్కడకు చేరుకున్న పోలీసులు ఇద్దరికి సర్దిచెప్పి పంపారు. పోలింగ్ కేంద్రం వద్ద జమ్మలమడుగు డీఎస్పీ యశ్వంత్ ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



జమ్మలమడుగు బాలుర కళాశాల వద్ద ఉద్యోగులను తనిఖీలు చేసి పోలింగ్ కేంద్రంలోకి పంపుతున్న పోలీసులు

ఓటు వేయని వారికి రేపు, ఎల్లుండి ఆర్వో వద్దే పోలింగ్

మైదుకూరు, మే 5 : పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోని వారికి ఆర్వో కార్యాలయంలో 7,8 తేదీల్లో అవకాశం కల్పించినట్లు ఆర్వో చంద్రమోహన్ తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొననున్న అధికారులు, ఓటు వేయని వారు ఎవరైనా ఉంటే దరఖాస్తు పెట్టుకొని కార్యాలయంలోనే ఓటు వేయాల్సి ఉంటుందన్నారు. కాగా సోమవారం ఫొటో, వీడియో గ్రాఫర్లు, పోలీసులు, అత్యవసర సేవల వారు జడ్పీ హైస్కూల్‌లో ఓటు వేయాలన్నారు. 80 ఏళ్ళు పైబడిన వారు ఉంటే వారి ఇళ్ళ వద్దకే పోలింగ్ సిబ్బంది వచ్చి ఓటు వేయించుకుంటారని తెలిపారు.

టీడీపీలోనే ఆర్యవైశ్యులకు మంచి గుర్తింపు

పోరుమామిళ్ల, మే 5 : టీడీపీలోనే ఆర్యవైశ్యులకు మంచి గుర్తిపు ఉంటుందని బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువనేత రితేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి పోరుమామిళ్లలోని శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి కళ్యాణమండపంలో ఆర్యవైశ్యుల ఆత్మీయసమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లోనే అందరి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కదిరి మాజీ ఎమ్మెల్యే పార్థసారధి, జిల్లా టీజేపీ అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, సాయినాథ్, సంతోష్, ప్రసాద్, రమణయ్య,ఆర్యవైశ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఇంటింటి ప్రచారాన్ని అడ్డుకున్న గ్రామ ప్రజలు

బహ్మంగారిమఠం, మే 5 :మండలంలోని రేకలకుంట పంచాయతీలోని బాగాదిపల్లె గ్రామంలో ఆదివారం వైసీపీ నేతలు ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత తమ గ్రామానికి రోడ్లు వేయలేదని మరలా ఐదు సంవత్సరాల తర్వాత వచ్చి ఓట్లు వేయమంటే ఎలా వేయాలని వైసీపీ నాయకులను బాగాదిపల్లె గ్రామ ప్రజలు నిలదీశారు.రోడ్డు వేయలేని వారు ప్రజలకు హామీ ఇవ్వడం ఎందుకని ప్రశ్నించారు. ఇందులో అడ్డుకున్న ఓబయ్య, ప్రతాప్‌పై వైసీపీ నేతలు ఫిర్యాదు చేయగా వారిని పోలీసులు తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులను వివరణ అడుగగా వారిని తాము తీసుకురాలేదని కానిస్టేబుల్ నాగేశ్ తెలిపారు.

వైసీపీ నేతలకు ఓటుతో ప్రజలు బుద్ధి చెప్పాలి



మాట్లాడుతున్న డాక్టర్ వైఎస్. సునీత

జమ్మలమడుగు, పెద్దముడియం, మే 5: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ నేతలకు ఓటు ద్వారా ప్రజలు గట్టిగా బుద్ధిచెప్పాలని డాక్టర్ వైఎస్.సునీతారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జమ్మలమడుగు నియోజకవర్గంలోని పెద్దముడియం మండలం పెద్దపసుపుల గ్రామంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు.అనంతరం పట్టణంలోని రామిరెడ్డిపల్లె మోటు, పెద్దపసుపులమోటు, తేరు రోడ్డు, పాత బస్టాండు, ఆర్టీసీ బస్టాండు వరకు వైఎస్.సునీత రోడ్‌షో నిర్వహించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వైఎస్.షర్మిల, ఎమ్మెల్యే అభ్యర్థి పాముల బ్రహ్మానందరెడ్డిని గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వి.ప్రసాద్, జి.వెంకటరావు, శివమోహన్‌రెడ్డి, పాలాజీ వెంకటస్వామి, మర్రి ప్రకాశం, సుబ్బారావు, సీపీఐ నాయకులు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నమూనా బ్యాలెట్‌తో ప్రజలకు అవగాహన

ప్రొద్దుటూరు టౌన్, మే 5: ఈవీఎంల ఓటింగ్‌పై నందమూరి యువసేవా నాయకులు ప్రజలకు అవగాహన కలిగించారు. 15వ వార్డు బాలాజీ నగర్‌లో బ్యాలెట్ నమూనాలతో ఓటు ఎలా వేయాలో అవగాహన కలిగించారు. ఇంటింటికి తిరిగి ఈవీఎంలో ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నందమూరి యువసేవా సమితి అధ్యక్షులు గోమేదికం సుదర్శన్ మాట్లాడుతూ సైకిల్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎంపీగా చదిపిరాళ్ల భూపేశ్ రెడ్డి, ఎమ్మెల్యేగా నంద్యాల వరదరాజులరెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నందమూరి యువసేవా సమితి ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, జనసేన నాయకులు మురళీకృష్ణ, మాజీ కౌన్సిలర్ బాదుబోయిన సుబ్బారావు, వెంకటతేజేశ్వరరెడ్డి, ప్రజీత్‌బాబు, సాయి, నాని, తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన ఎమ్మెల్యేను గద్దెదించండి




అమృతనగర్‌లో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి, రాజుపాలెం...కొరపాడు రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి, ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి

ప్రొద్దుటూరు ,మే 5 : టీడీపీతోనే అభివృద్ధి సంక్షేమం, సాధ్యమని కూటమి ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కొత్తపల్లె పంచాయతీలోని అమృతనగర్‌లో షేక్‌బాబావల్లి ఆధ్వర్యంలో 150 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరందరికి భూపేశ్,లింగారెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, వీఎస్ ముక్తియార్, కొత్తపల్లె సర్పంచ్ శివచంద్రారెడ్డి, జబీవుల్లా, బోడేల బాబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన ఎమ్మెల్యేను గద్దెదించండి

రాజుపాలెం, మే 5 : గోదాములో శనగలు నిల్వఉంచుకున్న రైతులకు డబ్బులు చెల్లిస్తామని మోసం చేసిన ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డిని గద్దెదించాలని ప్రొద్దుటూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కొరపాడులో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ముందుగా నంద్యాల వరదరాజులరెడ్డి, ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డిని గజమాలతో సత్కారం చేశారు. ఈ సందర్భంగా వరదరాజులరెడ్డి మాట్లాడుతూ సొంత చెల్లెలు అన్నకు ఓట్లు వేయవద్దని ప్రచారం చేస్తుంటే వైసీపీ ఎన్ని అరాచకాలకు ఒడిగడుతోందో ప్రజలకు అర్థమవుతోందని ఆయన తెలిపారు. ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ తమను గెలిపిస్తే జిల్లా అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీసభ్యులు తోట మహేశ్వర్‌రెడ్డి, కెమికల పురుషోత్తంరెడ్డి, ధనిరెడ్డి రామచంద్రారెడ్డి, ధనిరెడ్డి సుధాకర్‌రెడ్డి, బీసీ నేత చల్లా రాజగోపాల్ యాదవ్, శివచంద్రారెడ్డి, మానికింది ఖాదర్‌బాషా, హరిశ్చంద్రారెడ్డి, జయవీర ప్రతాప్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: ప్రొద్దుటూరులో వైసీపీ ఎమ్మెల్యేను గెలిపించటంతో అభివృద్ధి కుంటుపడటంతో పాటు దౌర్జన్యాలు, భూ, ఇసుకదందాలు పెరిగిపోయాయని మాజీ మున్సిపల్ చైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం 20 వవార్డులో టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులైన నంద్యాల వరదరాజులరెడ్డి, భూపేష్‌రెడ్డిని గెలిపించాలని ఇంటింటికి తిరిగి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో చెన్నకేశవాలయం మాజీ చైర్మెన్ రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద భూపేష్‌కు ఓటేయండి..: అభివృద్ధి జరగాలంటే టీడీపీ ఎమ్మెల్యేగా నంద్యాల వరదరాజులరెడ్డిని ఎంపీగా భూపేష్‌రెడ్డిని గెలిపించాలని వరదరాజులరెడ్డి కుమార్తెలు అనురాధ,అరుణ, కోడలు మీనా కోరారు.14 వవార్డు శ్రీనివాసనగర్‌లో సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు.



14 వవార్డు ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కుమార్తెలు, కోడలు



20 వవార్డు ప్రచారంలో పాల్గొన్న ఆసం రఘురామిరెడ్డి

వైసీపీ హఠావో ఏపీ బచావో

వరద, భూపేశ్‌కు మద్దతుగా సాఫ్ట్ వేర్ ఉద్యోగుల ర్యాలీ

ప్రొద్దుటూరు ,మే 5 : వైసీసీ హఠావో ఏపీ స్టేట్ బచావో అనే నినాదాలతో ప్రొద్దుటూరు వీధులు మారుమ్రోగాయి. అభివృద్ధి నిరోధకుడు జగన్ వల్ల రాష్ట్రంఅధోగతి పాలై యువత ఇతర రాష్ట్రాలలో ఉద్యోగాలకు వలసపోతున్న పరిస్థితి పై సాఫ్ట్ వేర్ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబు రావాలంటే సైకో పోవాలి బాబురావాలని పిలుపునిచ్చారు. ఆదివారం ప్రొద్దుటూరులో టీడీపీఅభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి మనువడు టీడీపీ యువనాయకుడు మెట్టుపల్లి అమల్‌రెడ్డి ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు భారీ ర్యాలీ చేపట్టారు. బెంగళురు హైదరాబాదు తదితర నగరాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్న యువత పెద్దఎత్తున ప్రొద్దుటూరుకు కదిలి వచ్చింది. మైదుకూరు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం నుంచి కొర్రపాడు రోడ్డులోని రాజీవ్ సర్కిల్ వరకు ఈ ర్యాలీ నిర్వహించారు.



విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ : రూ.లక్షకు పైగా నష్టం



కాలిపోయిన వస్తువులను చూపుతున్న బాధితులు, కాలిపోయిన దుస్తులు, కిటికీ, ఇతర వస్తువులు

జమ్మలమడుగు, మే 5: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని నేతాజీ నగర్ రాముని ఆలయం సమీపాన 16/60 నంబరు గల ఇంట్లో విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ జరిగింది. దీంతో ఇంట్లోని వస్తువులు కాలి బూడిదయ్యాయని బాధితులు వాపోయారు. ఈ ప్రమాదం శనివారం రాత్రి 12 గంటల సమయంలో ఇంట్లో కుటుంబ సభ్యులంతా మిద్దెపైన నిద్రిస్తుండగా ఉన్నట్లుండి ఇంట్లో మంటలు వచ్చాయని బాధితురాలు గురమ్మ, కుటుంబ సభ్యులు తెలిపారు. అదే సమయంలో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి వచ్చేలోగా పూర్తిగా దగ్ధమయ్యాయని, ఈ ఘటనలో ఇంట్లో వస్తువులు, కరెంటు మీటరు, వాకిలి, కిటికీలు, తదితర వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. ఉతకడానికి తెచ్చుకున్న బయటి వ్యక్తుల దుస్తులు, విలువైన చీరెలు కాలిపోయాయి. ఈ మేరకు ఆదివారం బాధితులు అగ్నిమాపక కార్యాలయం వద్దకు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో సుమారు రూ.లక్షకు పైగా నష్టం జరిగిందని అధికారులకు తెలుపగా కేసు నమోదు చేసినట్లు ఫైర్ సిబ్బంది తెలిపారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, స్థానికులు వెళ్లి పరిశీలించారు. బాధితులకు జిల్లా అధికారులు ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

మద్యంప్రియులకు ఊరట

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పోరుమామిళ్ల, మే 5: మద్యం ప్రియులకు ఊరట లభించింది. నిన్న, మొన్నటి దాకా ఫోన్ పే ఉంటేనే మద్యం.. లేదంటే మద్యం ఇచ్చేదే లేదు, అంతా డిజిటలైజేషన్ అని మద్యం షాపుల నిర్వాహకులు బోర్డులు పెట్టడంతో మద్యంప్రియులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయం ఆంధ్రజ్యోతికి తెలియడంతో ఫోన్‌పే ఉంటేనే మద్యం ఇదేమి చోద్యం, డిజిటలైజేషన్ ద్వారా చెల్లింపులు, ఆందోళనలో మద్యంప్రియులు అనే శీర్షిక ఏపీ దిన పత్రికలో ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన జిల్లా ఎక్సైజ్ అధికారులు ఆదివారం పోరుమామిళ్లలోని షాపు నిర్వాహకులకు ఫోను చేసి ఫోన్‌పేతో పాటు నగదు చెల్లించినా మద్యం ఇవ్వండి అని ఆదేశాలిచ్చారు. దీంతో మద్యంప్రియులకు ఊరట లభించింది. షాపుల వద్ద నోటీసు బోర్డులు తొలగించారు. నగదు తీసుకెళ్లినా మద్యం అమ్మకాలు జరుపుతున్నారు.



నోటీసు బోర్డు తొలగించిన దృశ్యం

సూపర్‌సిక్స్ పథకాల వల్ల ప్రజలకు లబ్ధి



ఎమ్మెల్యే అభ్యర్థి ఆది సమక్షంలో బీజేపిలోకి చేరుతున్న మాలేపాడు ఈశ్వరరెడ్డి

కొండాపురం, మే 5: ఎన్డీయే మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాల వల్ల ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని మండల బీజేపీ ఇన్‌చార్జి దేవగుడి శివనారాయణరెడ్డి తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి తరపున జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదినారాయణరెడ్డి, కడప ఎంపీ అభ్యర్థిగా భూపేష్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.కొండాపురం మండలంలోని బెడుదూరు గ్రామంలో ఆదివారం ఆయన ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ సర్పంచ్ నరసిహారెడ్డి పాల్గొన్నారు.

పలువురు ఎన్డీయే కూటమిలో చేరిక

మండలంలోని బెడుదూరు గ్రామంలో మండల బీజేపీ ఇన్‌చార్జి శివనారాయణరెడ్డి సమక్షంలో



కొండాపురం మండల బీజేపీ ఇన్‌ఛార్జ్ శివనారాయణరెడ్డి సమక్షంలో బెడుదూరులో పలువురు ఎన్డీయే కూటమిలో చేరిన దృశ్యం

స్థానికులు సురేష్,శివ,నరసింహులు, చెన్నప్ప,రవి తదితరులు కూటమిలో చేరారు.

ఎర్రగుంట్ల: వైసీపీ నుంచి రోజురోజుకు టీడీపీ, బీజేపీలోకి చేరికలు ఊపందుకున్నాయి. ఆదివారం ఎర్రగుంట్ల మండలంలోని మాలేపాడు మేకల ఈశ్వరరెడ్డి, ఆయన అనుచరులతో కలిసి ఆది సమక్షంలో బీజేపీలో చేరారు. ఆది వారికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే దండుపాడు రస్తాలోని 10కుటుంబాల వారిని ఎర్రగుంట్ల పార్టీ కార్యాలయంలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి వారికి కండువాకప్పి పార్టీలోకి స్వాగతించారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల గెలుపుకోసం కష్టపడి పనిచేయాలని వారికి ఆది సూచనలిచ్చారు.

వైభవంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

వల్లూరు, మే 5: ప్రసిద్ధిగాంచిన పంచమ నదీ సంగమంలో కొలువై ఉన్న కామాక్షి సమేత వైద్యనాథేశ్వర, శ్రీలక్ష్మి చెన్నకేశవల వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం సాయంత్రం ఇటు గ్రామంలో అటుకొండపైన ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు వైద్యనాథేశ్వర ఆలయంలో, అలాగే కొండపైన చెన్నకేశవస్వామి ఆలయంలో అంకురార్పణ గావించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అఖిల్, రాజేశ్‌లు పుట్టమన్ను తీసుకువచ్చి అంకురార్పణను గావించారు. అనంతరం పుట్టమన్నును ఆ పాలికలో ఉంచి పూజలు చేశారు. అనంతరం నవ ధాన్యాలను ఆ పాలికలో ఉంచి ఉత్సవాలు ప్రారంభించారు. కొండమీద ఆలయ అర్చకులు అఖిల్‌దీక్షితులు మేధిని పూజ చేశారు. ముందుగా శివకేశవులకు అమ్మవార్లకు అభిషేకాలు చేశారు. అనంతరం మేళతాళాలతో ఉత్సవాలు ప్రారంభించారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వివిధ హోమాలు ఉంటాయని, రాత్రివేళలో శివకేశవులు ఇద్దరూ వాహనంపై కూర్చుని గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు.

దస్తగిరి ప్రచార రథంపై ఇటుకలతో దాడి

- ఫ్లెక్సీ చింపేసిన వైసీపీ అభిమానులు



దస్తగిరి ప్రచార రథానికి చిరిగిన ఫ్లెక్సీ

పులివెందుల, మే 5: పులివెందుల ఎమ్మెల్యే అభ్యర్థిగా జైభీమ్ పార్టీ తరపున బరిలో ఉన్న దస్తగిరి ప్రచార రథంపై వైసీపీ అభిమానులు ఇటుకలతో దాడి చేశారు. పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గ స్థానానికి వివేకా హత్య కేసు అప్రూవర్ దస్తగిరి పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. తనను నామినేషన్ వేయనివ్వకుండా వైసీపీ నేతలు బెదిరించారని, ఐదుకోట్లు ఇస్తాం.. నామినేషన్ వేయొద్దని చెప్పారని అప్పట్లో దస్తగిరి మీడియాకు చెప్పారు. ఎట్టకేలకు చివరి రోజైన ఏప్రిల్ 25వ తేదీ మధ్యాహ్నం ఇతను పులివెందులలో నామినేషన్ వేశారు. అదేరోజు సీఎం వైఎస్ జగన్ సైతం నామినేషన్ వేశారు. ఇటీవల దస్తగిరి ప్రచార రథం ఏర్పాటు చేసుకుని తనకు ఓటు వేయాలంటూ పులివెందుల ప్రజలను రికార్డెడ్ పాటలు, మాటల ద్వారా అభ్యర్థిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో పులివెందుల గాంధీ సర్కిల్‌లోని నాలుగురోడ్ల కూడలి వద్ద ప్రచార రథం వస్తుండగా అక్కడే ఉన్న వైసీపీ అభిమానులు ప్రచార రథానికి ఉన్న లౌడ్ స్పీకర్‌పై ఇటుకలు విసిరారు. దీనితో ఒక లౌడ్ స్పీకర్ పాక్షికంగా దెబ్బతింది. అలాగే ఫ్లెక్సీని చింపేశారు. తన ప్రచార రథంపై దాడి చేయడంతో దస్తగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వడదెబ్బతో ఇరువురు వృద్ధులు మృతి

- కొండాపురంలో ఒకరు, మైదుకూరులో మరొకరు

కొండాపురం, మే 5: మండలంలోని పెంజి అనంతపురం గ్రామానికి చెందిన గురమ్మ(70) అనే వృద్ధురాలు వడదెబ్బతో మృతి చెందింది. గురమ్మ శనివారం పశువుల పేడ కోసం బయటకు వెళ్ళింది. ఎంతకూ ఇంటికి రాకపోయేసరికి ఆదివారం ఈమె కుమారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిమ్మాపురం పొలాల వద్ద కంపచెట్లలో ఈమె మృతదేహాన్ని ఆదివారం గుర్తించారు.విపరీతమైన ఎండలో తిరగడం వల్ల వడదెబ్బతో ఈమె మృతి చెందినట్లు భావిస్తున్నారు. ఈమె కుమారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొండాపురం ఎస్ఐ యోగీంద్ర తెలిపారు.

మైదుకూరులో: స్థానిక ఎంపీడీవో కార్యాలయం సముదాయంలో అపస్మారక స్థితిలో పడి ఉన్న వృద్ధుడిని స్థానిక పోలీసులు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతని వద్ద ఉన్న ఆధార్‌కార్డు సమాచారం మేరకు గాదె మురళీకృష్ణ (60), వల్లూరి వారితోట 7వ లైన్ గుంటూరుకు చెందిన వాసిగా పోలీసులు గుర్తించారు. కాగా మురళీకృష్ణ వడదెబ్బతోనే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నట్లు సమాచారం.

కేసీకి సాగునీరు లేనట్లేనా..?

- రబీలో రెండవ పంట హుళక్కే

చాపాడు, మే 5: ఈ ఏడాది కేసీ కెనాల్‌కు పుష్కలంగా సాగునీరు రాకపోవడంతో రైతులు పంటలను పూర్తిస్థాయిలో సాగు చేయలేకపోయారు. 2023 ఖరీఫ్ సీజన్‌లో అరకొరగా సాగునీరు రావడంతో ఆరుతడి పైర్లు సాగు చేశారు. ఇప్పుడు రబీ సీజన్‌లో సుమారు 90 శాతం పంటలను సాగు చేయలేదు. ప్రతి ఏడాది కేసీ కెనాల్‌కు శ్రీశైలం రిజర్వాయర్ నుంచి జూలై లేదా ఆగస్టు నెలల్లో సాగునీరు వచ్చేది. కానీ గత ఏడాది వర్షాలు పుష్కలంగా పడకపోవడంతో సాగునీరు కరువైంది. రైతులు జొన్న, మినుము, వరి వంటి పంటలు తక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. ప్రభుత్వం డిసెంబరు నెలలోనే కేసీ కెనాల్‌కు సాగునీరు నిలిపివేసింది. దీంతో రబీ సీజన్‌లో రైతులు పంటలు సాగు చేయలేదు. మండలంలో ఎక్కడ చూసినా బీడు భూములు దర్శనమిస్తున్నాయి. ప్రతి ఏడాది వరి పైరు సుమారు 26 వేల ఎకరాల్లో సాగు చేసేవారు. కానీ ఈ రబీ సీజన్‌లో కేవలం 2,500 ఎకరాల్లో వ్యవసాయ ఫిల్టర్ల కింద మాత్రమే వరిపైరు సాగు చేశారు. పచ్చని పైర్లతో కళకళలాడే మండలం సాగునీరు లేకపోవడంతో ఎడారిలా కనిపిస్తోంది. విశ్వనాథపురం, లక్ష్మీపేట, సీతారామపురం, పల్లవోలు, ఖాదర్‌పల్లె, చియ్యపాడు, సోమాపురం, ఇంకా పలు గ్రామాల పరిధిలో బీడు భూములుగా ఉన్నాయి. పైర్లు సాగు చేయకపోవడంతో రైతులు వీధుల్లోని అరుగులపై కూర్చొని మాటామంతీ చెప్పుకుంటూ కాలం గడుపుతున్నారు. వ్యవసాయ కూలీలకు కూలి పనులు లభించలేదు. కొంతమంది మహిళా కూలీలు పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారు. ప్రతి ఏడాది రైతులు, కూలీలు ఆహారం కోసం వరి ధాన్యం ఇళ్లలో నిలువ చేసుకునేవారు. కానీ పంట పండనందున వరి ధాన్యం ధర విపరీతంగా పెరిగాయి. జిలకర మసూర, జగిత్యాల, ఎన్‌డీఎల్ఆర్ వంటి వరి ధాన్యం పుట్టి (8 బస్తాలు) కొత్తవి రూ.14 వేలు ధర పలుకుతున్నాయి. ఇంత ధర పెట్టి కొనుగోలు చేయాలంటే పేదలు ఇబ్బంది పడుతున్నారు. పశువులకు మేత కూడా లభించలేదు. కేసీ కెనాల్‌కు ఉప కాలువలైన చాపాడు చానెల్, ఏటూరు కాలువల ద్వారా మండలంలోని గ్రామాలకు సాగునీరు అందుతుంది. పంటలు సాగు చేయకపోవడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



కాలువలో నీరు ప్రవహించని దృశ్యం



చాపాడు వద్ద బీడుగా ఉన్న భూములు

5 ఎకరాల భూమి బీడుగా ఉంది

- ద్వార్శల వీరారెడ్డి, రైతు, లక్ష్మీపేట గ్రామం



కేసీ కెనాల్‌కు సాగునీరు రానందున రబీ సీజన్‌లో పంట సాగు చేయలేదు. అయిదు ఎకరాల భూమి బీడుగా ఉంది. ప్రతి ఏడాది వరి, పసుపు, మినుము వంటి పంటలు సాగు చేసేవాడిని. కానీ ఈ రబీ సీజన్‌లో సాగు చేయలేదు. పశువులకు మేత కూడా లేదు. ఇప్పుడు కొత్త వరి ధాన్యం పుట్టి (8 బస్తాలు) రూ.18 వేలు ధర పలుకుతున్నాయి.

కౌలుకు భూమి చేసుకుంటున్నాను

- నాగేశ్వరరెడ్డి, రైతు, సీతారామపురం గ్రామం



కౌలుకు నాలుగు ఎకరాల భూమి సాగు చేసుకుంటున్నాను. కాలువలకు సాగునీరు రాలేదు. దీంతో భూమి ఇప్పుడు బీడుగా ఉంది. రబీ సీజన్ మొదట్లోనే కాలువకు అధికారులు సాగునీరు బంద్ చేశారు. లేకుంటే మినుము, పెసర, కూరగాయలు వంటి పంటలు సాగు చేసేవాడిని.

నేడు పోలింగ్ అధికారులకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం

- జిల్లా ఎన్నికల అధికారి

కడప(కలెక్టరేట్) మే 5: సోమవారం 6న కూడా ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలింగ్ అధికారులు తమ పోస్టల్ బ్యాలెట్ ఓటు నమోదు చేసుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కేటాయించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 5న పోస్టల్ బ్యాలెట్ అనివార్య కారణాల వల్ల నమోదు చేసుకోలేకపోయిన ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీవోలు, మైక్రో అబ్జర్వర్లు 6న కూడా తమకు కేటాయించిన నియోజకవర్గ ఫెసిలిటేషన్ పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యుత్తు షాక్‌తో రైతు మృతి



విద్యుత్తు షాక్‌తో మృతి చెందిన రామిరెడ్డి

ఖాజీపేట, మే 5: మండల పరిధిలోని సిద్ధాంతిపురం గ్రామానికి చెందిన కందుల రామిరెడ్డి (52) అనే రైతు విద్యుత్తు షాక్‌తో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్లితే... సిద్ధాపురం గ్రామానికి చెందిన రామిరెడ్డి తన పంట పొలంలో మోటారు వేసేందుకు వెళ్లి విద్యుత్తు షాక్‌కు గురయ్యాడు. పొలం దగ్గరకు వెళ్లి ఎంతసేపటికి రాకపోవడంతో ఫోన్ చేయగా ఎత్తకపోగా అనుమానం వచ్చి పొలం దగ్గరకు వెళ్లితే విద్యుత్తు షాక్‌కు గురై కిందపడి ఉండటాన్ని గమనించిన బంధువులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించడంతో ఆమేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

'సూపర్‌సిక్స్'తో పేదల జీవితాల్లో వెలుగు

- కూటమి అభ్యర్థిని గెలిపించండి
- కడప పార్లమెంటు అభ్యర్థి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి



ఎర్రగుంట్ల మండలంలోని తిప్పలూరు కన్వెన్షన్ సెంటరులో మాట్లాడుతున్న రాజ్‌నాథ్‌సింగ్, వేదికపై భూపేష్‌రెడ్డి ఆదినారాయణరెడ్డి



కడప పార్లమెంటు అభ్యర్థి భూపేష్‌రెడ్డికి మద్దతు తెలిపిన ఐటీ వింగ్ ఉద్యోగులు, పక్కన నంద్యాల కొండారెడ్డి

(కడప - ఆంధ్రజ్యోతి): పేదలను ధన వంతులుగా మార్చేందుకు టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి సూపర్‌సిక్స్ పథకాలను ప్రవేశపెట్టిందని, చంద్రబాబు సీఎం అయితే ఆ పథకాలు అమలై పేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతాయని టీడీపీ కడప పార్లమెంటు ఎన్‌డీకే కూటమి అభ్యర్థి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని అమృతనగర్‌లో ఎన్‌డీఏ అభ్యర్థి వరదరాజులరెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ జగన్‌పాలనలో జనం బతుకులు తల్లకిందులయ్యాయన్నారు. వైసీపీ నేతలు తప్ప పేదలంతా నష్టపోయారని చంద్రబాబును గెలిపిస్తే సూపర్‌సిక్స్ పథకాలతో అందరూ బాగుపడతారన్నారు. ఎర్రగుంట్ల మండలం తిప్పలూరు సమీపంలోని ఎకేఆర్ ఫంక్షన్ హాలులో ఎన్‌డీఏ కూటమి ఎన్నికల ప్రచార సభ, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. కార్యక్రమానికి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, జమ్మలమడుగు అసెంబ్లీ అభ్యర్థి ఆదినారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి మేనిఫెస్టోను ఇంటింటికీ తీసుకెళ్లాలన్నారు. డబుల్ ఇంజను సర్కారుతో రాష్ట్రం బాగుపడుతుందన్నారు. కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలన్నారు.

వంద మోకాలిమార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతం

కడప(సెవెన్‌రోడ్స్), మే 5: రాయలసీమలో మొట్టమొదటిసారిగా విద్యాసాగర్ హాస్పిటల్, కడపలో రోబెటిక్ టెక్నాలజీని ఉపయోగించి 100 మోకాలి కీళ్లమార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించినట్లు డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 2009లో కడపలో సాంప్రదాయ పద్ధతిలో (కన్వెన్షనల్) మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు ప్రారంభించి మెరుగైన ఫలితాల కోసం 2019లో కంప్యూటర్ నావిగేషన్ టెక్నాలజీని పరిచయం చేశామన్నారు. అత్యాధునిక ప్రపంచ స్థాయి రోబెటిక్ టెక్నాలజీని 2024లో రాయలసీమలో మొట్టమొదటసారిగా కడప నగరానికి తీసుకువచ్చినట్లు వివరించారు. రోబోటిక్ టెక్నాలజీ ద్వారా ప్రతి పేషంటుకు పర్సనలైజ్డ్ ప్లానింగ్ ద్వారా మోకాలి 3డి ఇమేజెస్ సహాయంతో సర్ఫేస్ మ్యాపింగ్ ద్వారా సబ్ మి.మీ. స్థాయిలో 100 శాతం ఖచ్చితత్వంతో మోకాలి పరికరాన్ని అమర్చుతున్నట్లు తెలిపారు. తద్వారా పేషంటు తక్కువ కాలంలోనే రికవరీ, మోకాలు పరికరాలు ఎక్కువ కాలం మన్నిక, సాధారణ మోకీలు అనే భావన, తక్కువ బ్లడ్ టిష్యూలాస్ వంటి అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. గత కొన్నేళ్లుగా 6 వేలకు పైగా మోకీలు శస్త్రచికిత్సలు చేసిన అనుభవంతో పాటు అత్యాధునిక ప్రపంచస్థాయి రోబోటిక్ టెక్నాలజీ వినియోగంతో మరింత సత్ఫలితాలు సాధించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీలక్ష్మి, హాస్పిటల్ సిబ్బంది, నగరానికి చెందిన ప్రముఖ డాక్టర్లు, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ, ఇంటాక్ ప్రతినిధులు విద్యాసాగర్ హాస్పిటల్ వారు చేసిన విశేష కృషిని అభినందిస్తూ డాక్టర్ విద్యాసాగర్, హాస్పిటల్ సిబ్బందిని సత్కరించారు.



కేక్‌కట్ చేస్తున్న డాక్టర్ విద్యాసాగర్, సిబ్బంది